# విశాల భారతి

తెలుగు దినపత్రిక

1-7-2026

www.vishalabharati.com
epaper.vishalabharati.com

బుధవారం, హైదరాబాద్ | సంపుటి:4 సంచిక: 7




### అడవి పుత్రుల ఆత్మగౌరవ
## కేతనం మేడారం

- మేడారాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది
- మాస్టర్ ప్లాన్‌లో శాశ్వత నిర్మాణాలు చేపడుతుంది
- ఆదివాసీల సాంస్కృతిక పునర్జీవనానికి వేదికగా తీర్చిదిద్దుతోంది

03



### ఇండస్ట్రీ వర్సెస్
# ఇందిరమ్మ రాజ్యం



సంక్రాంతి పండుగ వచ్చిందంటే చాలు తెలుగు రాష్ట్రాల్లో సందడి మామూలుగా ఉండదు. ముఖ్యంగా సినీ పరిశ్రమకు ఇది అతిపెద్ద సీజన్. ఈ ఏడాది కూడా అదే స్థాయిలో బాక్సాఫీస్ వద్ద యుద్ధం మొదలైంది. సుమారు అర డజను భారీ చిత్రాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. పందెం కోళ్ల తరహాలో స్టార్ హీరోల సినిమాలు థియేటర్లలోకి దూకడానికి సిద్ధమవుతున్న తరుణంలో, తెర వెనుక టికెట్ ధరల వ్యవహారం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. భారీ బడ్జెట్‌తో రూపొందిన ఈ చిత్రాల భవిష్యత్తు ఇప్పుడు ప్రభుత్వాలు ఇచ్చే జీవోల మీద, టికెట్ ధరల పెంపు నిర్ణయాల మీద ఆధారపడి ఉందనే చెప్పాలి.

- సంక్రాంతి పండుగ వచ్చిందంటే సందడి మామూలుగా ఉండదు
- ముఖ్యంగా తెలుగు సినీ పరిశ్రమకు ఇది అతిపెద్ద సీజన్
- ఈ ఏడాది కూడా అదే స్థాయిలో బాక్సాఫీస్ వద్ద యుద్ధం మొదలైంది
- టికెట్ ధరల వ్యవహారం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది
- భారీ బడ్జెట్ చిత్రాల భవిష్యత్తు ప్రభుత్వంపై ఆధారపడి ఉంది
- మంత్రి కోమటిరెడ్డి ప్రేక్షకుడిపై భారం పడకూడదనే ఉద్దేశంతో ఉన్నారు
- ఈ నేపథ్యంలో దిల్ రాజు సీఎం రేవంత్ రెడ్డిని కలిసినట్లు సమాచారం
- మంత్రి కోమటిరెడ్డితో చర్చించి నిర్ణయాన్ని తీసుకుంటామని హామీ

### సినిమా టికెట్ ధరల పెంపుపై కఠినంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ప్రస్తుతం తెలుగు చిత్ర పరిశ్రమ ఎదుర్కొంటున్న ప్రధాన సవాలు సినిమాల నిర్మాణం కోసం పెట్టిన ఖర్చును తిరిగి రాబట్టడం. హీరోల మార్కెట్ పరిమితులను దాటి మరీ నిర్మాతలు వందల కోట్లు ఖర్చు చేశారు. ప్రతి సినిమాకూ విపరీతమైన క్రేజ్ ఉండటంతో డిస్ట్రిబ్యూటర్లు కూడా భారీ రేట్లకు వీటిని కొనుగోలు చేశారు. ఈ పెట్టుబడి వెనక్కి రావాలంటే సాధారణ టికెట్ ధరలు సరిపోవని, కచ్చితంగా ధరలు పెంచాలని బయ్యర్లు కోరుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో టికెట్ రేట్ల పెంపు విషయంలో ప్రభుత్వం నుంచి సానుకూల సంకేతాలు ఉన్నప్పటికీ, తెలంగాణలో మాత్రం పరిస్థితి కాస్త గందరగోళంగా మారింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇక్కడ కొన్ని సాంకేతిక, భద్రతాపరమైన ఇబ్బందులు తలెత్తడం సినీ పెద్దలను ఆందోళనకు గురిచేస్తోంది. తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో సినీ పరిశ్రమకు పెద్దగా ఇబ్బందులు ఎదురుకాలేదు. పెద్ద సినిమాలకు అడిగిన వెంటనే ధరలు పెంచుకోవడానికి అనుమతులు లభించాయి. అయితే ఇటీవల 'పుష్ప 2' ప్రీమియర్ షోల సమయంలో హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటన మొత్తం పరిస్థితిని మార్చివేసింది. ఒక ప్రాణం పోవడం, పలువురు గాయపడటంతో ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుంది. కేవలం టికెట్ ధరలే కాకుండా, షోల సమయాలు , భద్రతా ఏర్పాట్లపై కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు 'ఓజీ', 'అఖండ 2' వంటి సినిమాలకు భారీగా రేట్లు పెంచడంపై ఒక న్యాయవాది హైకోర్టును ఆశ్రయించడం కూడా ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారింది. కోర్టు కేసులు, ప్రజల నుంచి వచ్చే విమర్శల నేపథ్యంలో సినిమాటోగ్రఫీ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి ఈసారి టికెట్ ధరల పెంపు విషయంలో కాస్త కఠినంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తన వైఖరిని స్పష్టం చేస్తూ, సామాన్య ప్రేక్షకుడిపై భారం పడకూడదనే

మిగతా 2లో..



# హిల్ట్ పై మాటల తూటాలు

- హిల్ట్ పాలసీపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం
- ఈ విధానంపై బీజేపీ తీవ్రమైన అభ్యంతరాలను వ్యక్తం చేస్తోంది
- ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు మధ్య వాదోపవాదాలు
- జీవో 27 అత్యంత వివాదాస్పదంగా ఉందని మహేశ్వర్‌రెడ్డి ఆరోపణ
- విమర్శలను మంత్రి శ్రీధర్‌బాబు అంతే దీటుగా తిప్పికొట్టారు
- పాలసీ రాబోయే తరాల ఆరోగ్యానికి సంబంధించిన చారిత్రక నిర్ణయమన్నారు





**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ శాసనసభ వేదికగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'హిల్ట్' పాలసీపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరింది. రాష్ట్ర పారిశ్రామిక రంగంలో పెను మార్పులకు నాంది పలుకుతుందని ప్రభుత్వం చెబుతున్న ఈ విధానంపై బీజేపీ తీవ్రమైన అభ్యంతరాలను వ్యక్తం చేస్తోంది. ముఖ్యంగా జీవో 27 చుట్టూ ఇప్పుడు రాజకీయ వేడి రాజుకుంది. ఈ నేపథ్యంలో బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మధ్య జరిగిన వాదోపవాదాలు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ఈ వివాదానికి కేంద్ర బిందువైన జీవో 27 అత్యంత వివాదాస్పదంగా ఉందని మహేశ్వర్‌రెడ్డి ఆరోపిస్తున్నారు. ఈ జీవో అసలు పబ్లిక్ డొమైన్‌లోకి రాకముందే లీక్ కావడం వెనుక ప్రభుత్వంలో ఒక విధమైన ఆందోళన కనిపిస్తోందని ఆయన ఎద్దేవా చేశారు. పారిశ్రామిక అవసరాల కోసం కేటాయించిన భూములను ఇప్పుడు టౌన్‌షిప్‌లుగా,

మిగతా 2లో..



## దళపతికి పిలుపు

- కరూర్ తొక్కిసలాట ఉదంతం ఇప్పుడు సరికొత్త మలుపు తిరిగింది
- టీవీకే పార్టీ అధినేత దళపతి విజయ్‌కు ఊహించని షాక్ తగిలింది
- సీబీఐ అధికారులు తాజాగా విజయ్‌కు సమన్లు జారీ చేశారు

02

### కేసీఆర్ అసెంబ్లీకి వస్తే
# రేవంత్ గుండె ఆగిపోతుంది

- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై కేటీఆర్ నిప్పులు చెరిగారు
- ఎమ్మెల్సీ కవిత భావోద్వేగ ప్రకటనపై కేటీఆర్ స్పందించారు
- సర్పంచ్‌లు, ఉపసర్పంచులు అభినందన సభలో పాల్గొన్నారు
- కుటుంబంలో సమస్యలు సహజమని అభిప్రాయపడ్డారు
- రేవంత్ రెడ్డికి తెలంగాణ భూగోళంపై అవగాహన లేదన్నారు
- కేసీఆర్ ఒక ప్రెస్ మీట్ పెడితే రేవంత్ రెడ్డి వణికిపోయారన్నారు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో కుటుంబ బంధాలు, పార్టీ అంతర్గత పరిణామాలు, అధికార కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. జనగామ పట్టణంలోని భ్రమరాంబ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన సర్పంచ్‌లు, ఉపసర్పంచులు, వార్డు సభ్యుల అభినందన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చేసిన ప్రసంగం అటు రాజకీయ విమర్శలతోనూ, ఇటు కుటుంబ బంధాలపై భావోద్వేగపూరిత వ్యాఖ్యలతోనూ సాగింది. ముఖ్యంగా ఎమ్మెల్సీ కవిత శాసనమండలిలో చేసిన భావోద్వేగ ప్రకటనపై కేటీఆర్ స్పందించిన తీరు అందరినీ ఆకర్షించింది. కుటుంబం అన్నాక సమస్యలు ఉండటం చాలా సహజమని ఆయన అభిప్రాయపడ్డారు. ఎక్కడైనా చిన్నపాటి అలుగుడు, గులుగుడు లేకపోతే అది అసలు కుటుంబమే కాదని ఆయన వ్యాఖ్యానించారు. కుటుంబ సభ్యుల మధ్య

మిగతా 3లో..



### తెలంగాణ గర్వకారణం
## ఓరుగల్లు కోట

- తెలంగాణ రాజకీయాల్లో మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది
- మంత్రి కిషన్‌రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు
- వరంగల్ కోట భూములను కాపాడాలని గట్టిగా కోరారు

03

## విజన్ 2047 రాష్ట్ర భవిష్యత్ దిక్సూచి

విజన్ డాక్యుమెంట్ ఒక దిక్సూచని డిప్యూటీ సీఎం అభివర్ణించారు

- భవిష్యత్తును నిర్దేశించిన ఒక బలమైన మార్గమని స్పష్టం చేశారు
- రాష్ట్ర జీఎస్‌డీపీ ప్రస్తుతం 200 బిలియన్ డాలర్లకు చేరుకుందన్నారు
- 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యమని ప్రకటించారు
- మారుమూల ప్రాంతాలు కూడా అభివృద్ధి చెందాలని డీసీఎం ఉద్ఘాటించారు
- మహిళా సాధికారత విజన్ డాక్యుమెంట్ ఆత్మ అని ప్రకటించారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తును సువర్ణాక్షరాలతో లిఖించేందుకు ప్రభుత్వం రూపొందించిన 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్ ఒక అద్భుతమైన దిక్సూచిగా నిలుస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అత్యంత ఆత్మవిశ్వాసంతో ప్రకటించారు. ఈ పత్రం కేవలం గణాంకాలతో కూడిన ఒక ప్రభుత్వ నివేదిక మాత్రమే కాదని, రాబోయే తరాల ఉజ్వల భవిష్యత్తుకు వేసిన బలమైన పునాది అని ఆయన అభివర్ణించారు.

మిగతా 2లో..

# కాంగ్రెస్‌లోకి కేసీఆర్ గారాలపట్టీ..!

- ఎమ్మెల్సీ కవిత రాజకీయాలు పెను సంచలనంగా మారాయి
- కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోబోతున్నారనే వార్తలు వస్తున్నాయి
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఈ ప్రచారానికి బలాన్ని చేకూర్చారు
- దానం నాగేందర్ బాటలో కవిత కూడా నడుస్తారని స్పష్టం చేశారు
- ఆమె కాంగ్రెస్ అగ్రనాయకత్వంతో టచ్‌లోకి వెళ్లారని వెల్లడించారు

02





# హిల్‌ట్‌పై మాటల తూటాలు





( మొదటిపేజీ తరువాయి )

అపార్ట్‌మెంట్‌లుగా మార్చాలనే ఆలోచన వెనుక పెద్ద మతలబు ఉందన్నది ఆయన ప్రధాన ఆరోపణ. పరిశ్రమలకు అతితక్కువ ధరకే భూములు ఇచ్చినప్పుడు, వాటిని రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మార్చుకునే అవకాశం కల్పించడం ద్వారా ప్రభుత్వం ఎవరికి మేలు చేయాలని చూస్తోందని ఆయన నిలదీశారు. హిల్ట్ పాలసీకి సంబంధించి ఏర్పాటైన సబ్ కమిటీ తీసుకున్న నిర్ణయాలను ఎందుకు గోప్యంగా ఉంచారని, ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన స్పష్టం చేశారు. మహేశ్వర్‌రెడ్డి తన ప్రసంగంలో ప్రధానంగా పారిశ్రామికవాడల అన్యాక్రాంతం గురించి ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 22 పారిశ్రామిక ప్రాంతాలను రియల్ ఎస్టేట్ లాబీలకు అప్పగించే కుట్ర జరుగుతోందని, ఇది రాష్ట్ర పారిశ్రామిక వృద్ధిని కుంటుపరుస్తుందని ఆయన హెచ్చరించారు. ఫార్మా సిటీ కోసం సేకరించిన భూములను ఇప్పుడు ఫోర్త్ సిటీకి వాడుతున్న తీరును ఆయన తప్పుబడుతూ, ఈ విషయంలో హైకోర్టు సైతం ప్రభుత్వం నుంచి వివరణ కోరిన విషయాన్ని గుర్తు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వేల సంఖ్యలో జీవోలను రహస్యంగా ఉంచిందని విమర్శించిన మహేశ్వర్‌రెడ్డి, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో పయనిస్తోందని విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన వేలాది జీవోలలో కేవలం కొద్ది శాతం మాత్రమే ప్రజలకు అందుబాటులో ఉండటం పారదర్శకతకు నిదర్శనమా అని ఆయన ప్రశ్నించారు.

అయితే ప్రతిపక్షాల విమర్శలను మంత్రి శ్రీధర్‌బాబు అంతే దీటుగా తిప్పికొట్టారు. హిల్ట్ పాలసీ అనేది కేవలం భూముల మార్పిడికి సంబంధించిన వ్యవహారం కాదని, ఇది రాబోయే తరాల ఆరోగ్యానికి సంబంధించిన చారిత్రక నిర్ణయమని ఆయన సమర్థించుకున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ నగర నడిబొడ్డున ఉన్న బాలానగర్, సనత్‌నగర్, ఉప్పల్ వంటి ప్రాంతాలు ఒకప్పుడు నగరం వెలుపల ఉండేవని, కానీ నేడు అవి జనసమ్మర్థం గల నివాస ప్రాంతాలుగా మారిపోయాయని ఆయన వివరించారు. నివాస గృహాల పక్కనే ఫ్యాక్టరీ గోడలు ఉండటం వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందని, ఇది ఒక సైంటిఫిక్ డిజాస్టర్‌గా ఆయన అభివర్ణించారు. ప్రజలకు స్వచ్ఛమైన గాలి, నీరు అందించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత అని, అభివృద్ధి పేరిట పర్యావరణాన్ని నాశనం చేయడం సరికాదని ఆయన స్పష్టం చేశారు. హిల్ట్ పాలసీ అమలుపై వస్తున్న అపోహలను మంత్రి కొట్టిపారేశారు. ఈ పాలసీ కింద ఎవరినీ బలవంతం చేయడం లేదని, ఆరు నెలల గడువు ఇస్తామని, స్వచ్ఛందంగా ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలకు మాత్రమే భూముల కన్వర్షన్ చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. ఇక్కడ పారిశ్రామికవేత్తల భూములను ప్రభుత్వ భూములుగా ప్రభుత్వం ప్రచారం చేయడం లేదని, దశాబ్దాల క్రితమే గత ప్రభుత్వాలు ఆ భూములను వారికి అమ్మేశాయని ఆయన క్లారిటీ ఇచ్చారు. పారిశ్రామిక కాలుష్యం నుంచి నగరాన్ని కాపాడి, పరిశ్రమలను ఔటర్ రింగ్ రోడ్డు అవతలికి తరలించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పర్యావరణ పరిరక్షణ కోసం తీసుకున్న ఈ నిర్ణయం తెలంగాణను దేశంలోనే ఆదర్శంగా నిలుపుతుందని ధీమా వ్యక్తం చేశారు.

చివరగా, ప్రకృతి సంపదపై మనకు యాజమాన్య హక్కులు లేవని, కేవలం మనం వాటికి ట్రస్టీలము మాత్రమేనని శ్రీధర్‌బాబు ఉద్వేగభరితంగా మాట్లాడారు. మన పిల్లలకు కేవలం డబ్బు, ఆస్తులు ఇస్తే సరిపోదని, పీల్చడానికి స్వచ్ఛమైన గాలిని అందించడమే నిజమైన వారసత్వం అని ఆయన పేర్కొన్నారు. మొత్తానికి, హిల్ట్ పాలసీ చుట్టూ తిరుగుతున్న ఈ వివాదం అటు పారిశ్రామిక అభివృద్ధికి, ఇటు పర్యావరణ పరిరక్షణకు మధ్య జరుగుతున్న పెనుగులాటగా కనిపిస్తోంది. ప్రభుత్వం దీనిని సామాజిక బాధ్యతగా చిత్రీకరిస్తుంటే, ప్రతిపక్షం మాత్రం దీని వెనుక రియల్ ఎస్టేట్ ప్రయోజనాలు ఉన్నాయని వాదిస్తోంది. ఈ ఘర్షణ రాబోయే రోజుల్లో ఇంకెన్ని మలుపులు తిరుగుతుందో వేచి చూడాలి.

# దళపతికి పిలుపు

- కరూర్ తొక్కిసలాట ఉదంతం ఇప్పుడు సరికొత్త మలుపు తిరిగింది
- టీవీకే పార్టీ అధినేత దళపతి విజయ్‌కు ఊహించని షాక్ తగిలింది
- సీబీఐ అధికారులు తాజాగా విజయ్‌కు సమన్లు జారీ చేశారు
- ఈనెల 12వ తేదీన చారణకు హాజరుకావాలని సీబీఐ ఆదేశించింది
- తదుపరి చర్యలు కఠినంగా ఉండే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు
- కరూర్ దుర్ఘటనలో ఏకంగా 41 మంది అభాగ్యులు మృతి చెందారు



**విశాలభారతి, నేషనల్:**

తమిళనాడు రాజకీయాల్లో పెను సంచలనం రేపుతున్న కరూర్ తొక్కిసలాట ఉదంతం ఇప్పుడు సరికొత్త మలుపు తిరిగింది. రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత వేగంగా ఎదుగుతున్న 'తమిళగ వెట్రి కళగం' పార్టీకి, ఆ పార్టీ అధినేత దళపతి విజయ్‌కు ఊహించని షాక్ తగిలింది. గత ఏడాది కరూర్‌లో జరిగిన విషాద ఘటనకు సంబంధించి సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ అధికారులు తాజాగా విజయ్‌కు సమన్లు జారీ చేయడం రాజకీయ వర్గాల్లో ఒక్కసారిగా వేడి పుట్టించింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఈనెల 12వ తేదీన చెన్నైలోని తమ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని సీబీఐ ఆదేశించడంతో, కోలీవుడ్ నుంచి పాలిటిక్స్ వరకు అందరి దృష్టి ఇప్పుడు దళపతిపైనే నిలిచింది.

గత ఏడాది సెప్టెంబర్ 27వ తేదీ తమిళనాడు చరిత్రలో ఒక చీకటి రోజుగా మిగిలిపోయింది. కరూర్ జిల్లా వేలుస్వామిపురంలో టీవీకే పార్టీ భారీ రాజకీయ బహిరంగ సభను నిర్వహించింది. విజయ్ తన రాజకీయ ప్రయాణాన్ని దిగ్విజయంగా ప్రారంభించాలనే సంకల్పంతో ఏర్పాటు చేసిన ఈ సభకు జనం సునామీలా పోటెత్తారు. పార్టీ వర్గాల అంచనాలను మించి లక్షలాది మంది తరలిరావడంతో అక్కడి యంత్రాంగం ఒక్కసారిగా చేతులెత్తేసింది. జనం తాకిడిని తట్టుకోలేక, సరైన బారికేడ్లు లేకపోవడంతో పరిస్థితి అదుపు తప్పి తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ దుర్ఘటనలో ఏకంగా 41 మంది అభాగ్యులు మృత్యువాత పడటం యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది.

ఈ ఘటనపై ప్రాథమిక విచారణ చేపట్టిన స్థానిక పోలీసులు, ఆ తర్వాత కేసు తీవ్రత దృష్ట్యా ప్రభుత్వం దర్యాప్తును సీబీఐకి అప్పగించింది. అప్పటి నుంచి ఈ కేసులో అడుగడుగునా ఉత్కంఠ కొనసాగుతోంది. కేవలం భద్రతా వైఫల్యం మాత్రమేనా లేక సభ నిర్వహణలో ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం ఉందా అనే కోణంలో సీబీఐ అధికారులు లోతుగా పరిశోధిస్తున్నారు. ఇప్పటికే పార్టీకి చెందిన ద్వితీయ శ్రేణి నాయకులను, సభ వాలంటీర్లను, స్థానిక నిర్వాహకులను పలు దఫాలుగా విచారించి కీలక సాక్ష్యాలను సేకరించారు. ఇప్పుడు నేరుగా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడినే విచారణకు పిలవడం చూస్తుంటే, ఈ కేసులో సీబీఐ వద్ద బలమైన ఆధారాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

విజయ్‌కు జారీ చేసిన సమన్లలో సీబీఐ ప్రధానంగా సభ నిర్వహణ అనుమతులు, జనసమీకరణ ప్రణాళికల గురించి ప్రశ్నించే అవకాశం ఉంది. ఒక భారీ బహిరంగ సభను తలపెట్టినప్పుడు అనుసరించాల్సిన కనీస భద్రతా ప్రమాణాలను ఎందుకు విస్మరించారనేది అధికారుల ప్రధాన ప్రశ్నగా కనిపిస్తోంది. సభకు వచ్చే వారి సంఖ్యపై పోలీసులకు ఇచ్చిన నివేదికకు, క్షేత్రస్థాయిలో వచ్చిన జనానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని అధికారులు ఎత్తి చూపుతున్నారు. సభ నిర్వహణ బాధ్యతను ఎవరికి అప్పగించారు, వారికి తగిన అనుభవం ఉందా లేదా అన్న అంశాలపై కూడా విజయ్‌ను నిలదీసే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. రాజకీయంగా ఈ పరిణామం తమిళనాడులో ప్రకంపనలు సృష్టిస్తోంది. అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న తరుణంలో, విజయ్ దూకుడుకు బ్రేకులు వేయడానికే కేంద్ర సంస్థలను ప్రయోగిస్తున్నారంటూ టీవీకే శ్రేణులు ఆరోపిస్తున్నాయి. తమ నాయకుడిపై వస్తున్న ఈ ఒత్తిడిని రాజకీయ కక్ష సాధింపుగా వారు అభివర్ణిస్తున్నారు. అయితే, 41 మంది ప్రాణాలు కోల్పోయిన ఘటన చిన్న విషయం కాదని, దీనిపై బాధ్యత వహించాల్సిన అవసరం ఖచ్చితంగా ఉందని ప్రత్యర్థి పార్టీలు వాదిస్తున్నాయి. ఈ వివాదం ప్రస్తుతం సోషల్ మీడియాలో కూడా ట్రెండింగ్‌గా మారి, నెటిజన్ల మధ్య తీవ్ర చర్చకు దారితీస్తోంది.

సీబీఐ అధికారులు ఈ కేసులో కేవలం నిర్వాహకులనే కాకుండా, ఆ రోజు అక్కడి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించిన ప్రభుత్వ అధికారులను కూడా విచారించినట్లు సమాచారం. సభకు అనుమతి ఇచ్చే సమయంలో నిబంధనలను పాటించారా లేదా అన్నది ఇప్పుడు కీలక పాయింట్‌గా మారింది. ఒకవేళ భద్రతా నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే, అది టీవీకే పార్టీ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. విజయ్ స్వయంగా హాజరై ఇచ్చే వాంగ్మూలం ఈ కేసులో అత్యంత కీలకం కానుంది. చట్టపరమైన చిక్కులను ఆయన ఎలా ఎదుర్కొంటారనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలింది. విజయ్ అభిమానులు ఈ వార్త వినగానే ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. జనవరి 12న ఆయన సీబీఐ కార్యాలయానికి వెళ్లే సమయంలో భారీ నిరసనలు లేదా మద్దతు ర్యాలీలు జరిగే అవకాశం ఉందని నిఘా వర్గాలు హెచ్చరిస్తున్నాయి. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా చెన్నైలో అదనపు బలగాలను మోహరిస్తున్నారు. తన సినిమా కెరీర్‌లో ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్న విజయ్, ఇప్పుడు రాజకీయ క్షేత్రంలో ఎదురైన ఈ అతిపెద్ద పరీక్షను ఎలా అధిగమిస్తారన్నది ఆసక్తికరంగా మారింది. పార్టీ ఆవిర్భావం తర్వాత ఎదురైన ఈ మొదటి గండం టీవీకే ఉనికినే ప్రశ్నార్థకం చేసేలా ఉందన్న ఆందోళన కార్యకర్తల్లో వ్యక్తమవుతోంది. మరోవైపు, సీబీఐ సేకరించిన డాక్యుమెంట్లలో సభ నిర్వహణ కోసం వెచ్చించిన నిధులు, వసూలు చేసిన విరాళాల గురించిన వివరాలు కూడా ఉన్నట్లు పుకార్లు వినిపిస్తున్నాయి. కేవలం తొక్కిసలాట మాత్రమే కాకుండా, ఆర్థిక పరమైన కోణాలను కూడా దర్యాప్తు సంస్థ స్పృశిస్తోందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ ఇన్వెస్టిగేషన్ బాట మారి ఆర్థిక మూలాల వైపు వెళ్తే, సమస్య మరింత జటిలమయ్యే అవకాశం ఉంది. బాధితుల కుటుంబాలకు న్యాయం జరగాలని కోరుకుంటున్న సామాన్య ప్రజలు, ఈ విచారణ ద్వారా వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆశిస్తున్నారు.

తమిళనాడు రాజకీయాలు ఎప్పుడూ సెంటిమెంట్లతో ముడిపడి ఉంటాయి. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాల పట్ల ప్రజల్లో సానుభూతి ఉంది. అదే సమయంలో విజయ్‌ను టార్గెట్ చేస్తున్నారనే భావన ఆయన అభిమానుల్లో ఉంది. ఈ రెండింటి మధ్య సమతుల్యత దెబ్బతింటే అది రాష్ట్రంలో ఉద్రిక్తతలకు దారితీయవచ్చు. విజయ్ రాజకీయ భవిష్యత్తు ఈ విచారణ ఫలితంపైనే ఆధారపడి ఉంది. ఆయన ఇచ్చే వివరణ అధికారులు సంతృప్తి చెందేలా లేకపోతే, తదుపరి చర్యలు కఠినంగా ఉండే అవకాశం ఉందని న్యాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. మొత్తానికి, జనవరి 12వ తేదీ తమిళనాడు రాజకీయ చరిత్రలో ఒక మైలురాయిగా నిలవబోతోంది. సీబీఐ ఎదుట విజయ్ హాజరు కావడం అనేది కేవలం ఒక వ్యక్తి విచారణ కాదు, ఒక రాజకీయ శక్తికి ఎదురైన అగ్నిపరీక్షగా పరిగణించవచ్చు. ఈ కేసు మరెన్ని మలుపులు తిరుగుతుందో, ఇందులో ఎవరి పాత్ర ఎంతవరకు ఉందో తెలియాలంటే మరికొద్ది రోజులు వేచి చూడక తప్పదు.

# విజన్ 2047 రాష్ట్ర భవిష్యత్ దిక్సూచి



( మొదటిపేజీ తరువాయి )

రాష్ట్రం సాధించబోయే సమగ్ర అభివృద్ధికి ఇది ఒక కార్యాచరణ ప్రణాళికగా పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు. గత మూడు దశాబ్దాల తెలంగాణ ఆర్థిక ప్రస్థానాన్ని విశ్లేషిస్తూ 1991 నుంచి ప్రతి పదేళ్లకు ఒకసారి రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి రెట్టింపు అవుతూ వస్తోందని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుతం తెలంగాణ ఆర్థిక వ్యవస్థ సుమారు 200 బిలియన్ డాలర్ల స్థాయికి చేరుకుందని వివరించారు. ఈ ప్రగతిని మరింత వేగవంతం చేస్తూ 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల మహా ఆర్థిక వ్యవస్థగా మార్చడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధి కేవలం హైదరాబాద్ నగరానికే పరిమితం కాకూడదని, రాష్ట్రంలోని ప్రతి మారుమూల గ్రామానికి ప్రగతి ఫలాలు అందాలన్నదే ఈ విజన్ డాక్యుమెంట్ వెనుక ఉన్న అసలు ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. ఇందుకోసం భౌగోళిక విభజన ఆధారంగా మూడు అంచెల వ్యూహాత్మక అభివృద్ధి నమూనాను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని భట్టి విక్రమార్క వెల్లడించారు. కోర్ అర్బన్ రీజియన్, పెరిఅర్బన్ రీజియన్ మరియు రూరల్ అగ్రి రీజియన్ అనే మూడు విభాగాల ద్వారా రాష్ట్ర రూపురేఖలను మార్చనున్నట్లు తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న ప్రాంతాన్ని 'కోర్ అర్బన్ రీజియన్' గా పరిగణిస్తూ ఇక్కడ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన అభివృద్ధిని చేపడతామని వివరించారు. దీని కింద ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్, హెల్త్ సిటీలతో కూడిన 'భారత్ ఫ్యూచర్ సిటీ'ని నిర్మించబోతున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రపంచ స్థాయి సౌకర్యాలతో కూడిన ఈ నగరం తెలంగాణ కీర్తిని విశ్వవ్యాప్తం చేస్తుందని, అంతర్జాతీయ పెట్టుబడులకు ఇది ప్రధాన కేంద్రంగా మారుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఔటర్ రింగ్ రోడ్డు, ప్రాంతీయ రింగ్ రోడ్డు మధ్య ఉన్న ప్రదేశాన్ని 'పెరిఅర్బన్ రీజియన్'గా అభివృద్ధి చేస్తామని భట్టి విక్రమార్క తెలియజేశారు. ఈ ప్రాంతంలో భారీ పరిశ్రమలు, తయారీ రంగాలు, లాజిస్టిక్స్ హబ్‌లను ఏర్పాటు చేయడం ద్వారా వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. నగరాభివృద్ధికి, గ్రామీణ ప్రాంతాలకు మధ్య ఈ ప్రాంతం ఒక వారధిలా ఉంటూ ఆర్థిక కార్యకలాపాలను వేగవంతం చేస్తుందని వివరించారు.

ప్రాంతీయ రింగ్ రోడ్డుకు అవతల ఉన్న విశాలమైన భూభాగాలను 'రూరల్ అగ్రి రీజియన్' కింద అభివృద్ధి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. కేవలం సంప్రదాయ వ్యవసాయానికే పరిమితం కాకుండా, ఆధునిక బయోఎకానమీని ఇక్కడ ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. రైతులకు అధిక ఆదాయం సమకూర్చే పంటలను సాగు చేస్తూ, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలను మారుమూల గ్రామాల్లో నెలకొల్పడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. దేశాన్ని నిర్మించేది కేవలం భారీ భవనాలు లేదా మౌలిక సదుపాయాలు మాత్రమే కాదని, అంకితభావం కలిగిన ప్రజలే దేశానికి నిజమైన సంపద అని భట్టి విక్రమార్క ఉద్ఘాటించారు. అందుకే మానవ వనరుల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. యువతలో నైపుణ్యాలను పెంపొందించడం ద్వారానే ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడం సాధ్యమవుతుందని ఆయన గట్టిగా నమ్ముతున్నట్లు వెల్లడించారు. యువతకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ'ని ఏర్పాటు చేశామని, దీని ద్వారా జర్మన్ మోడల్ అప్రెంటిస్‌షిప్ విధానాన్ని అమలులోకి తెస్తామని ఆయన వివరించారు. విద్యార్థులు కేవలం థియరీ క్లాసులకే పరిమితం కాకుండా, పరిశ్రమలలో నేరుగా పని చేస్తూ నైపుణ్యాన్ని గడించేలా ఈ ప్రోగ్రామ్ రూపొందించబడిందని చెప్పారు. దీనివల్ల చదువు పూర్తయిన వెంటనే అభ్యర్థులు నేరుగా ఉద్యోగాల్లో చేరడానికి అవసరమైన అర్హతను సంపాదిస్తారని వివరించారు.

విద్యా విధానంలో 'డిగ్రీ టు కాంపిటెన్సీ' అనే నూతన ఒరవడిని తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. కేవలం పట్టాలు అందుకోవడమే కాకుండా, వారు ఏ రంగంలో ఉన్నారో ఆ రంగంలో నిష్ణాతులుగా ఎదగడమే ప్రధాన లక్ష్యమని చెప్పారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పాఠ్యప్రణాళికను మార్చుతూ, సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను యువత త్వరగా ఒడిసిపట్టేలా ప్రోత్సహిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఆరోగ్యవంతమైన సమాజం లేనిదే ఆర్థిక పురోగతి సాధ్యం కాదని గుర్తించి, వైద్య రంగంపై పెట్టే వ్యయాన్ని గణనీయంగా పెంచాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన వెల్లడించారు. రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తిలో ఎనిమిది శాతం నిధులను వైద్య మరియు ఆరోగ్య సేవలకు కేటాయించనున్నట్లు ప్రకటించారు. ప్రతి పౌరుడికి మెరుగైన ఉచిత వైద్యం అందించడమే కాకుండా, ఆరోగ్య రక్షణపై ప్రజల్లో అవగాహన పెంచడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ఆయన వివరించారు. మహిళా సాధికారత ఈ విజన్ డాక్యుమెంట్ ఆత్మ అని భట్టి విక్రమార్క ఎంతో గర్వంగా ప్రకటించారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చడమే తమ ప్రభుత్వ అంతిమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. కేవలం పొదుపు సంఘాల ద్వారా అప్పులు తీసుకోవడానికే పరిమితం కాకుండా, మహిళలను స్వయం సమృద్ధి కలిగిన పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు. మహిళా స్వయం సహాయక బృందాలను కార్పొరేట్ సంస్థల స్థాయికి ఎదిగేలా ప్రోత్సహిస్తామని ఆయన వివరించారు. వారి ఆర్థిక లావాదేవీల చరిత్రను, క్రమశిక్షణను డిజిటలైజ్ చేయడం ద్వారా బ్యాంకుల నుంచి తక్కువ వడ్డీకే భారీ మూలధనం అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మారుమూల పల్లెల్లో ఉండే మహిళలకు కూడా బంజారాహిల్స్ లాంటి నగరాల్లో ఉండే పారిశ్రామిక వేత్తలకు లభించే ఆర్థిక సదుపాయాలు లభించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు.

సబ్సిడీల మీద ఆధారపడటం కంటే, స్వశక్తితో వ్యాపారాలను నడపడం ద్వారా మహిళలకు శాశ్వత ఆర్థిక భద్రత లభిస్తుందని భట్టి విక్రమార్క అభిప్రాయపడ్డారు. ఇందుకోసం వారికి అవసరమైన శిక్షణ, మార్కెటింగ్ సౌకర్యాలు మరియు సాంకేతిక సహకారాన్ని ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. మహిళలు ఉత్పత్తి చేసే వస్తువులకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చేందుకు ప్రత్యేక బ్రాండింగ్ వ్యవస్థను కూడా రూపొందిస్తామని ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు. 2014వ సంవత్సరంలో సోనియా గాంధీ గారి మార్గదర్శకత్వంలో రాజకీయ తెలంగాణ ఏర్పడిందని గుర్తుచేస్తూ, ఇప్పుడు పదేళ్ల తర్వాత 2024లో ఆర్థిక తెలంగాణ నిర్మాణానికి పునాది వేస్తున్నామని ఆయన భావోద్వేగంగా చెప్పారు. ఇది కేవలం ఒక ప్రసంగం కాదని, రాష్ట్ర ప్రజలతో ప్రభుత్వం చేసుకుంటున్న సరికొత్త సామాజిక ఒప్పందం అని ఆయన పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యం లేకుండా ఏ ప్రణాళికా విజయవంతం కాదని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ విజన్ డాక్యుమెంట్ ఒక ముగిసిన పుస్తకం కాదని, ఇది నిరంతరం మార్పులకు లోనయ్యే ఒక సజీవ వేదిక అని భట్టి విక్రమార్క వర్ణించారు. దీనిపై నిర్మాణాత్మకమైన చర్చ జరగాలని, ప్రతిపక్ష సభ్యులు కూడా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర బాగు కోరి ఇచ్చే ఏ సూచననైనా ప్రభుత్వం సానుకూలంగా తీసుకుంటుందని, అందరం కలిసి పనిచేస్తేనే కలల తెలంగాణ సాకారం అవుతుందని ఆయన స్పష్టం చేశారు.

# కాంగ్రెస్‌లోకి కేసీఆర్ గారాలపట్టీ..!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం ఎమ్మెల్సీ కవిత చుట్టూ తిరుగుతున్న పరిణామాలు పెను సంచలనంగా మారాయి. తన తండ్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ధిక్కరిస్తూ, పార్టీ వినాశనాన్ని కోరుకుంటున్నారనే ఆరోపణల నడుమ, ఆమె కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోబోతున్నారనే వార్తలు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ముఖ్యంగా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చేసిన వ్యాఖ్యలు ఈ ప్రచారానికి బలాన్ని చేకూరుస్తున్నాయి. దానం నాగేందర్, కడియం శ్రీహరి వంటి సీనియర్ నేతలు ఏ విధంగానైతే కాంగ్రెస్‌లోకి వచ్చారో, కవిత కూడా అదే బాటలో నడుస్తారని ఆయన స్పష్టం చేయడం గమనార్హం. మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి బెయిల్‌పై బయటకు వచ్చినప్పటి నుంచే కవిత తన రాజకీయ వ్యూహాలను మార్చుకున్నట్లు కనిపిస్తోంది. జైలు నుంచి వచ్చిన వెంటనే ఆమె కాంగ్రెస్ అగ్రనాయకత్వంతో టచ్‌లోకి వెళ్లారని, పార్టీ మార్పుపై అప్పుడే ప్రాథమికంగా ఒక నిర్ణయానికి వచ్చారని సమాచారం. "కవిత కాంగ్రెస్‌లో చేరినా ఆశ్చర్యపోనక్కర్లేదు" అంటూ మల్‌రెడ్డి రంగారెడ్డి బహిరంగంగా వ్యాఖ్యానించడం చూస్తుంటే, తెర వెనుక భారీ స్క్రిప్టే నడుస్తోందని అర్థమవుతోంది. ఇది కేవలం ఒక నేత వ్యక్తిగత అభిప్రాయం కాదని, పార్టీ లోపల జరుగుతున్న పరిణామాల ప్రతిబింబమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కవిత కాంగ్రెస్ వైపు అడుగులు వేయడం వెనుక చాలా పెద్ద ప్రణాళికే ఉందని తెలుస్తోంది. సొంత పార్టీపై, ముఖ్యంగా తండ్రి కేసీఆర్ నిర్ణయాలపై ఆమె అసంతృప్తితో ఉన్నారని, అందుకే ఆమె ఉద్దేశపూర్వకంగా తిరుగుబాటు బావుటా ఎగురవేశారని గుసగుసలు వినిపిస్తున్నాయి. తన అన్నలు కేటీఆర్, సంతోష్ కుమార్, బావ హరీష్ రావుతో పాటు పార్టీలోని కీలక నేతలైన జగదీష్ రెడ్డి, నిరంజన్ రెడ్డి వంటి వారిపై ఆమె చేసిన ఘాటు విమర్శలు పార్టీ వర్గాలను విస్మయానికి గురిచేశాయి. ఇంటి గుట్టును బజారున పడేస్తూ, తనను పార్టీ నుంచి పంపించేలా ఆమె వ్యూహాత్మకంగా వ్యవహరించి బహిష్కరణకు గురయ్యారని సమాచారం. నిజానికి 2025లోనే కవిత కాంగ్రెస్ అధిష్టానంతో సంప్రదింపులు జరిపినట్లు వార్తలు వస్తున్నాయి. ఆ సమయంలోనే ఆమె చేరిక ఖాయమని అనుకున్నప్పటికీ, తెలంగాణలోని స్థానిక కాంగ్రెస్ నేతలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో అధిష్టానం వెనక్కి తగ్గింది. ఇటీవల జరిగిన రెండు మంత్రివర్గ విస్తరణల్లో కూడా కవిత పేరు పరిశీలనలోకి వచ్చిందని, కానీ పాత విభేదాలు, లిక్కర్ స్కామ్ నేపథ్యంలో ఎదురయ్యే విమర్శలను దృష్టిలో పెట్టుకుని అప్పట్లో ఆ ప్రక్రియ ఆగిపోయిందని తెలుస్తోంది. అయితే ఇప్పుడు పరిస్థితులు వేగంగా మారుతున్నాయి. లిక్కర్ స్కామ్ సమయంలో కవితను విమర్శించిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు ఆమెను పార్టీలోకి చేర్చుకోవడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ఆమెను చేర్చుకుంటే ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని, రాజకీయంగా తమకు ఇబ్బంది కలుగుతుందని రాష్ట్ర స్థాయి నాయకత్వం అధిష్టానానికి మొరపెట్టుకుంది. అయినప్పటికీ, భవిష్యత్ రాజకీయ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ అధిష్టానం కవిత చేరికకు పచ్చ జెండా ఊపినట్లు తెలుస్తోంది. కేవలం సమయం కోసం వేచి చూస్తున్నారని, త్వరలోనే ముహూర్తం ఖరారు కానుందని సమాచారం. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి కనువిప్పు కలిగించాయి. బీఆర్ఎస్ క్యాడర్ క్షేత్రస్థాయిలో ఇంకా బలంగానే ఉందని, ప్రభుత్వ వ్యతిరేకతను తమకు అనుకూలంగా మార్చుకోలేకపోతున్నామని కాంగ్రెస్ గ్రహించింది. కవితను బీఆర్ఎస్ నుంచి వేరు చేసినప్పటికీ, ఆ పార్టీ కేడర్ చీలిపోకపోవడం కాంగ్రెస్‌కు పెద్ద తలనొప్పిగా మారింది. ఈ నేపథ్యంలోనే కవితను రంగంలోకి దించి, ఆమె ద్వారా గులాబీ కేడర్‌ను తమ వైపు తిప్పుకోవాలని కాంగ్రెస్ పెద్దలు స్కెచ్ వేశారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

కవిత కొత్త పార్టీ పెడతానని గతంలో హడావుడి చేసినప్పటికీ, అది క్షేత్రస్థాయిలో సాధ్యం కాదని గ్రహించి కాంగ్రెస్ బాట పట్టినట్లు కనిపిస్తోంది. తనపై ఉన్న కేసుల నుంచి ఉపశమనం పొందాలన్నా, రాజకీయ భవిష్యత్తు ఉండాలన్నా అధికార పార్టీలో చేరడమే ఉత్తమమని ఆమె భావిస్తున్నారట. అందుకే గతంలో చేసిన విమర్శలను పక్కన పెట్టి, హస్తం పార్టీకి జై కొట్టేందుకు సిద్ధమయ్యారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి వ్యాఖ్యలు కేవలం సంకేతాలు మాత్రమే కావని, అది కవిత చేరికకు వేసిన పునాది అని స్పష్టమవుతోంది. "అనుకున్నట్టుగానే అందరూ వస్తారు" అని ఆయన చెప్పడం వెనుక బలమైన కారణాలే ఉన్నాయి.

# ఇండస్ట్రీ వర్సెస్ ఇందిరమ్మ రాజ్యం






( మొదటిపేజీ తరువాయి )

ఉద్దేశంతో ఉన్నట్లు సమాచారం. సినిమా అనేది సామాన్యుడి వినోదం అని, దాన్ని అతిగా పెంచడం వల్ల థియేటర్లకు వచ్చే వారి సంఖ్య తగ్గే ప్రమాదం ఉందని ఆయన భావిస్తున్నారు. అయితే సినిమా ఇండస్ట్రీ మనుగడ సాగించాలంటే ఈ పెంపు తప్పనిసరి అని నిర్మాతలు వాదిస్తున్నారు. ఈ క్రమంలోనే ఇండస్ట్రీ పెద్ద దిక్కుగా వ్యవహరిస్తున్న దిల్ రాజు రంగంలోకి దిగారు. తెలంగాణ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా ఉన్న దిల్ రాజుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. దీంతో ఆయన నేరుగా ముఖ్యమంత్రినే కలిసి పరిస్థితిని వివరించినట్లు టాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. సంక్రాంతికి వస్తున్న సినిమాల బడ్జెట్ వివరాలు, డిస్ట్రిబ్యూటర్ల రిస్క్ గురించి దిల్ రాజు ముఖ్యమంత్రికి వివరించినట్లు తెలుస్తోంది. సుమారు ఆరు సినిమాలు ఒకేసారి వస్తున్నప్పుడు, పోటీ ఎక్కువగా ఉంటుందని, సరైన ఆదాయం రాకపోతే ఇండస్ట్రీ దెబ్బతింటుందని ఆయన విన్నవించినట్లు సమాచారం. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు వార్తలు వస్తున్నాయి. మంత్రి కోమటిరెడ్డితో చర్చించి, మధ్యేమార్గంగా ఒక నిర్ణయాన్ని తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. బహుశా ఒక్కో సినిమా బడ్జెట్ మరియు స్థాయిని బట్టి వేర్వేరుగా జీవోలు జారీ చేసే అవకాశం ఉంది. ఇవాళో రేపో ఈ ఉత్కంఠకు తెరపడే అవకాశం కనిపిస్తోంది. ఈ ఏడాది సంక్రాంతి రేసులో ఉన్న సినిమాలు కూడా సామాన్యమైనవి కావు. గ్లోబల్ స్టార్ ప్రభాస్ నటిస్తున్న 'రాజా సాబ్' పై భారీ అంచనాలు ఉన్నాయి. హారర్ కామెడీ జోనర్‌లో వస్తున్న ఈ సినిమా ప్రభాస్ రేంజ్‌ను మరో మెట్టు ఎక్కించేలా ఉంటుందని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. అలాగే తమిళ స్టార్ హీరో విజయ్ నటించిన 'జన నాయకుడు' తెలుగులో కూడా భారీ స్థాయిలో విడుదల కాబోతోంది. ఇక మెగాస్టార్ చిరంజీవి తన మార్కు సోషియో ఫాంటసీ ఎంటర్‌టైనర్ 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. మాస్ మహారాజా రవితేజ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' అంటూ ఒక వైవిధ్యమైన కథతో వస్తుండగా, యువ హీరో శర్వానంద్ 'నారీ నారీ నడుమ మురారి' తో ఫ్యామిలీ ఆడియన్స్‌ను టార్గెట్ చేస్తున్నారు. ఇక చాలా కాలం తర్వాత నవీన్ పోలిశెట్టి 'అనగనగా ఒక రాజు' అంటూ నవ్వించడానికి వస్తున్నారు.

ఇన్ని సినిమాలు ఒకేసారి రావడం వల్ల థియేటర్ల కేటాయింపు విషయంలో కూడా పెద్ద కసరత్తే జరుగుతోంది. ప్రతి సినిమాకు కనీసం వారం రోజుల పాటు మంచి రేట్లు ఉంటేనే నిర్మాతలు సేఫ్ జోన్‌లోకి వస్తారు. అందుకే ప్రభుత్వం ఇచ్చే రాయితీలు లేదా అనుమతులు ఇప్పుడు అత్యంత కీలకంగా మారాయి. తెలంగాణలో నెలకొన్న ఈ ఉత్కంఠకు సీఎం రేవంత్ రెడ్డి పరిష్కారం చూపిస్తే, సంక్రాంతి బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురవడం ఖాయం. సినిమా రంగంపై ఆధారపడిన వేలాది కుటుంబాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని పరిశ్రమ వర్గాలు ఆశిస్తున్నాయి.

# అడవి పుత్రుల ఆత్మగౌరవ కేతనం మేడారం

## మేడారాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది



- మాస్టర్ ప్లాన్‌లో శాశ్వత నిర్మాణాలు చేపడుతుంది
- ఆదివాసీల సాంస్కృతిక పునర్జీవనానికి వేదికగా తీర్చదిద్దుతోంది
- రూ. 250 కోట్లతో శాశ్వత నిర్మాణాలు చేపట్టేందుకు సిద్ధమైంది
- ఈ నెల 12వ తేదీలోపు పనులను పూర్తి చేయాలని నిర్ణయం
- నాలుగు వేల టన్నుల గ్రానైట్ వినియోగించనున్నారు







**విశాలభారతి ప్రత్యేకం:**

తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధి గాంచిన మేడారం సమ్మక్కసారలమ్మ జాతర చరిత్రలో సరి కొత్త అధ్యాయం మొదలైంది. ఆదివాసీల ఆరాధ్య దైవాలైన వనదేవతల గద్దెలను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా పునర్నిర్మిస్తోంది. కేవలం తాత్కాలిక సౌకర్యాలకే పరిమితం కాకుండా, రాబోయే వందల ఏళ్ల వరకు చెక్కుచెదరకుండా ఉండేలా 'మేడారం మాస్టర్ ప్లాన్'ను ప్రభుత్వం అమలు చేస్తోంది. ఈ బృహత్తర ప్రాజెక్టు ద్వారా మేడారం ప్రాంతం ఒక ఆధ్యాత్మిక కేంద్రంగానే కాకుండా, ఆదివాసీ సాంస్కృతిక పునర్జీవన వేదికగా రూపుదిద్దుకుంటోంది. గతంలో జాతర జరిగిన ప్రతిసారీ తాత్కాలిక పనులకే కోట్లాది రూపాయలు ఖర్చు చేసేవారు. కానీ, ప్రస్తుత ప్రభుత్వం సుమారు రూ. 250 కోట్ల భారీ వ్యయంతో శాశ్వత ప్రాతిపదికన నిర్మాణాలను చేపట్టింది. ఈ మాస్టర్ ప్లాన్‌లో భాగంగా సమ్మక్క, సారలమ్మల గద్దెల ప్రాంగణాన్ని అద్భుతమైన రాతి కట్టడాలతో తీర్చిదిద్దుతున్నారు. గద్దెల చుట్టూ ప్రాకారం, ప్రవేశ ద్వారాలు, తోరణాలను కృష్ణశిలలతో నిర్మించి చరిత్రలో ఒక మైలురాయిగా నిలిపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ నిర్మాణాల కోసం సుమారు 4,000 టన్నుల అత్యుత్తమ నాణ్యత కలిగిన గ్రానైట్ రాళ్లను వినియోగిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ ప్రాంతం నుండి ఈ ప్రత్యేక గ్రానైట్‌ను సేకరించారు. రాయచోటి పరిసరాల నుండి సేకరించిన ఈ భారీ శిలలను 600 కిలోమీటర్ల దూరం నుండి మేడారానికి తరలించారు. గత 500 సంవత్సరాల కాలంలో ఆదివాసీ దేవాలయాల కోసం ఇంతటి భారీ స్థాయిలో రాతి కట్టడం చేపట్టడం ఇదే తొలిసారి అని నిపుణులు అభివర్ణిస్తున్నారు. ఈ శిల్పకళా చాతుర్యం వెనుక వందలాది మంది కళాకారుల శ్రమ దాగి ఉంది. ఆళ్లగడ్డ మరియు అన్నమయ్య జిల్లాలకు చెందిన సుమారు 450 మంది శిల్పులు రేయింబవళ్లు శ్రమిస్తున్నారు. కేవలం రాళ్లను పేర్చడం మాత్రమే కాకుండా, వాటిపై అద్భుతమైన శిల్పాలను చెక్కుతున్నారు. సమ్మక్కసారలమ్మల వీరగాథను తెలిపే సుమారు 7,000 బొమ్మలను ఈ గ్రానైట్ శిలలపై మలిచారు. ప్రభుత్వం 100 రోజుల లక్ష్యంతో ఈ పనులను శరవేగంగా పూర్తి చేయిస్తోంది.



మేడారం గద్దెల ప్రాంగణంలోని ఈ శిల్పాలు ఆదివాసీల జీవన విధానానికి అద్దం పడుతున్నాయి. ముఖ్యంగా కోయ తెగకు చెందిన చారిత్రక పూర్వాపరాలు, వారి సంస్కృతి, ఆచార వ్యవహారాలను ఈ చిత్రాల్లో చూడవచ్చు. కేవలం మౌఖికంగా మాత్రమే ప్రచారంలో ఉన్న ఆదివాసీల గాథలను రాళ్లపై చెక్కి శాశ్వతం చేస్తున్నారు. దీనివల్ల భవిష్యత్తు తరాలకు కోయల ఆధ్యాత్మిక మరియు సామాజిక జీవనంపై స్పష్టమైన అవగాహన కలిగే అవకాశం ఏర్పడింది. గద్దెల ప్రాంగణంలో సమ్మక్క, సారలమ్మతో పాటు జంపన్న, పగిడిద్దరాజు, గోవిందరాజుల చరిత్రను వివరించే ఘట్టాలను చెక్కారు. వీటితో పాటు ఆదివాసీల గోత్రాలు, వారి మూలాలు తెలిపే చిహ్నాలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. కోయల ఇష్ట దైవాలుగా భావించే పులి, ఏనుగు, జింక, నెమలి,



మొసలి వంటి పశుపక్ష్యాదుల బొమ్మలు శిల్పాలపై ప్రాణం పోసుకుంటున్నాయి. ప్రతి జంతువుకూ ఆదివాసీల విశ్వాసాలతో బలమైన సంబంధం ఉండటం గమనార్హం. కోయల 'గొట్టు' (తెగ విభజన) సంప్రదాయాన్ని ఈ నిర్మాణాలలో అత్యంత శాస్త్రీయంగా పొందుపరిచారు. 3, 4, 5, 6, 7 గొట్టులకు సంబంధించిన గుర్తులను స్తంభాలపై చెక్కారు. ఆదివాసీలలో ఉండే సుమారు 750 ఇంటి పేర్లు, వాటి మూలాల వివరాలను కూడా శిలలపై భద్రపరిచారు. సమ్మక్క తల్లికి చెందిన ఐదవ గొట్టును సూచించే ఐదు నిలువు గీతలు, సారలమ్మకు చెందిన మూడవ గొట్టును సూచించే మూడు గీతలు ఇక్కడ ప్రత్యేకంగా కనిపిస్తాయి. ప్రధాన స్వాగత తోరణంపై చెక్కిన 58 బొమ్మలు భక్తులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. ఇందులో సమ్మక్క వంశీయులైన 'రాయి బందానీ' వంశ మూలాలను చిత్రీకరించారు. ఐదవ గొట్టుకు చిహ్నమైన ఒంటికొమ్ము దుప్పి, అడవి దున్న కొమ్ములు మరియు ఆరు నెమలి ఈకల చిత్రాలు వారి వీరత్వాన్ని చాటి చెబుతున్నాయి. అలాగే మూడవ గొట్టుకు సంబంధించిన వంశ వృక్షాలను, వారి పవిత్ర వృక్షమైన ఇప్ప చెట్టును కూడా అద్భుతంగా మలిచారు. ఆదివాసీల గొట్టు వ్యవస్థలో ఒక్కో తెగకు ఒక్కో జంతువు లేదా పక్షి పవిత్రమైనది. ఉదాహరణకు, కొందరు ఉడుమును పూజిస్తే, మరి కొందరు నెమలిని గౌరవిస్తారు. ఇలాంటి సూక్ష్మ వివరాలను కూడా శిల్పులు గ్రానైట్ రాళ్లపై చెక్కారు. ఎనిమిదవ గొట్టుకు చిహ్నమైన 'X' ఆకారం, ఎనిమిది లతల గుర్తు చ వారి వంశ చిహ్నాలు భక్తులకు ఆదివాసీల ప్రాచీన నాగరికతను పరిచయం చేస్తున్నాయి. కోయల చరిత్ర ప్రకారం ప్రాచీన అఖండ భారతంలో వారు ఉత్తరాన 36 రాజ్యాలను, దక్షిణాన 18 రాజ్యాలను పాలించినట్లు చెబుతారు. ఈ చారిత్రక అంశాలను ప్రతిబింబించేలా 18 దిక్కులను సూచించే చిహ్నాలను కూడా గద్దెల ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. అడవిలో పులి రూపంలో సమ్మక్క దర్శనమిస్తుందని ఆదివాసీలు బలంగా నమ్ముతారు, అందుకే ప్రాంగణమంతటా పులి శిల్పాలకు ప్రాధాన్యత కల్పించారు. మత సామరస్యానికి మరియు వివిధ తెగల కలయికకు మేడారం నిదర్శనం. ఇక్కడ ఆదివాసీ దేవతలతో పాటు గోవిందరాజుల (వెంకటేశ్వర స్వామి స్వరూపం) ఆనవాళ్లు కూడా కనిపిస్తాయి. గోవిందరాజుల గద్దెపై శంఖు, చక్రం, తిరుమల శ్రీవారి నామాల వంటి వైష్ణవ చిహ్నాలను చెక్కారు. శైవ సాంప్రదాయానికి చిహ్నమైన శివలింగాలు, త్రిశూలాలు కూడా ఈ గ్రానైట్ కట్టడాలపై కొలువుదీరాయి.

సమ్మక్క సారలమ్మలు కేవలం దేవతలు మాత్రమే కాదు, అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడిన వీర వనితలు. వారి ఆయుధాలు, వారు వాడిన బాణాలు, త్రిశూలాలను కూడా శిల్ప కళలో భాగంగా మార్చారు. కోయల సంప్రదాయ 'తూతకొమ్ము' వాయిద్యం, వేల్పు పండగ వేడుకలు, అడవిలో వారి వేట సాగించే విధానం వంటి సామాజిక అంశాలను ఈ శిలలపై గీశారు. ఈ ప్రాజెక్టులో వినియోగించిన ప్రతి గుర్తుకు ఒక లోతైన అర్థం ఉంది. ఉదాహరణకు చతురస్రం, త్రిభుజం, వృత్తం వంటి ఆకారాలు వేర్వేరు గొట్టుల రాజ్యాలకు చిహ్నాలు. తెల్లని గ్రానైట్ స్తంభాలపై ఈ చిహ్నాలు మెరుస్తూ, రాత్రి వేళల్లో విద్యుత్ కాంతుల మధ్య మరింత శోభాయమానంగా కనిపిస్తున్నాయి. ఇవన్నీ ఆదివాసీల విజ్ఞానాన్ని, వారి ఖగోళ మరియు భౌగోళిక అవగాహనను చాటిచెబుతున్నాయి.

తెలంగాణ పంచాయతీ రాజ్ , గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఈ పనులను పర్యవేక్షిస్తున్నారు. స్వయంగా ఆదివాసీ బిడ్డ కావడంతో ఆమె ఈ ప్రాజెక్టుపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. జనవరి 12వ తేదీ లోపు అన్ని పనులను పూర్తి చేసి, జనవరి 20 లోపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ నూతన గద్దెల ప్రాంగణాన్ని ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. మేడారం జాతర కేవలం రెండేళ్లకు ఒకసారి వచ్చే పండుగ మాత్రమే కాదు, అది తెలంగాణ అస్తిత్వానికి ప్రతీక. అందుకే ప్రభుత్వం చేపట్టిన ఈ శాశ్వత నిర్మాణాలు భక్తులకు మెరుగైన వసతులు కల్పించడమే కాకుండా, పర్యాటక రంగంలో మేడారానికి ఒక ప్రత్యేక గుర్తింపును తీసుకువస్తాయి. రాతి కట్టడాల వల్ల రాబోయే తరాలకు మన సంస్కృతిని అందించే అవకాశం లభిస్తుంది.

ముఖ్యంగా ఆదివాసీ గిరిజనుల గోత్రాలు, వారి ఇంటి పేర్ల వివరాలు శిలలపై ఉండటం వల్ల భక్తులు తమ మూలాలను తెలుసుకునే వీలు కలుగుతుంది. 250 వంశాల చరిత్రను క్రోడీకరించి ఒకే చోట పొందుపరచడం సామాన్యమైన విషయం కాదు. ఇది ఒక చారిత్రక గ్రంథాన్ని శిలలపై లిఖించినట్లుగా ఉంది. సమ్మక్క సారక్కల మహా జాతరకు దేశ విదేశాల నుండి భక్తులు తరలివస్తారు. ఇప్పుడు మారిన మేడారం రూపురేఖలు చూసి వారు ఆశ్చర్యపోవడం ఖాయం. ఆళ్ళగడ్డ శిల్పుల చేతుల్లో ప్రాణం పోసుకున్న ఈ గ్రానైట్ నిర్మాణాలు అద్భుతమైన కళాఖండాలుగా నిలిచిపోతాయి. దక్షిణ భారత దేశంలోనే అతి పెద్ద గిరిజన జాతరగా మేడారం తన కీర్తిని మరింత దిగంతాలకు వ్యాపింపజేస్తుంది. మొత్తానికి, మేడారం గద్దెల పునరుద్ధరణ పనులు ఒక కొత్త సంస్కృతికి నాంది పలికాయి. రాతి కట్టడాల నిర్మాణం, ఆదివాసీ చిహ్నాల ముద్రణ, భారీ వ్యయంతో కూడిన మాస్టర్ ప్లాన్ మేడారం రూపురేఖలను పూర్తిగా మార్చివేస్తున్నాయి. ఇది కేవలం ఒక భవన నిర్మాణం కాదు, ఆదివాసీల ఆత్మగౌరవ ప్రతీక. రాబోయే జాతర నాటికి మేడారం ఒక నూతన శోభను సంతరించుకోనుంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మక లక్ష్యంతో నిర్మిస్తున్న ఈ గ్రానైట్ ప్రాకారం, తోరణాలు భక్తులకు భద్రతతో పాటు ఆధ్యాత్మిక అనుభూతిని అందిస్తాయి. గిరిజన సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేయడంలో ఈ మాస్టర్ ప్లాన్ విజయం సాధిస్తుందని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు.

# కేసీఆర్ అసెంబ్లీకి వస్తే రేవంత్ గుండె ఆగిపోతుంది

( మొదటి పేజీ తరువాయి )

ఏవైనా విభేదాలు ఉంటే అవి ఇంట్లోనే పరిష్కరించుకోవాలని, అందరూ కలిసికట్టుగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. కవిత తన కుటుంబంతో బంధం తెంచుకుంటున్నానని, కేవలం రాజకీయ శక్తిగా తిరిగి వస్తానని ప్రకటించిన నేపథ్యంలో కేటీఆర్ చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీశాయి. చెల్లెలి ఆవేదనను అర్థం చేసుకుంటూనే, కుటుంబ ఐక్యత ఎంత ముఖ్యమో ఆయన నొక్కి చెప్పారు. రాజకీయ పోరాటాల్లో కుటుంబం అండగా ఉండాల్సిన అవసరాన్ని ఆయన పరోక్షంగా గుర్తుచేశారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రేవంత్ రెడ్డికి తెలంగాణ భూగోళంపై కానీ, ఇక్కడి నదుల ప్రవాహంపై కానీ కనీస అవగాహన లేదని ఎద్దేవా చేశారు. గోదావరి నది ఎక్కడ ప్రవహిస్తుందో తెలియని వ్యక్తి, సాగునీటి రంగంలో అపర మేధావి అయిన కేసీఆర్ గారికి పాఠాలు చెప్పడం హాస్యాస్పదమని మండిపడ్డారు. తెలంగాణకు ఏమాత్రం సంబంధం లేని ఉత్తరాదిలోని 'భాక్రా నంగల్' ప్రాజెక్టు రాష్ట్రంలో ఉందని రేవంత్ రెడ్డి గతంలో వ్యాఖ్యానించడాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. ఇది ఆయన అజ్ఞానానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. పాలన అంటే కేవలం మూటలు మోయడం కాదని, ప్రజల కష్టాలను గుర్తించి వాటిని తీర్చడమే నిజమైన నాయకత్వమని ఆయన హితవు పలికారు. రేవంత్ రెడ్డికి తెలివి తక్కువ మాటలు చెప్పడంపై ఉన్న శ్రద్ధ, అభివృద్ధిపై లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా సంపూర్ణంగా నెరవేర్చలేదని కేటీఆర్ ఆరోపించారు. వరంగల్ రైతు డిక్లరేషన్ పేరిట రాహుల్ గాంధీ ఇచ్చిన హామీలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని దుయ్యబట్టారు. రూ. 15,000 రైతుబంధు, రూ. 500 బోనస్, కౌలు రైతులకు ఆర్థిక సాయం వంటి పథకాలు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. నిరుద్యోగుల విషయంలో కూడా కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. గత ఎన్నికల్లో నిరుద్యోగులను రెచ్చగొట్టి ఓట్లు వేయించుకున్న రాహుల్ గాంధీ, అధికారంలోకి వచ్చాక ఉద్యోగాల ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. నిరుద్యోగ భృతి హామీ అటకెక్కిందని, కొత్త నోటిఫికేషన్ల ఊసే లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా సంక్షేమం గురించి మాట్లాడుతూ.. ఆడబిడ్డలకు నెలకు రూ. 2,500 ఇస్తామని చెప్పి కాంగ్రెస్ మోసం చేసిందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. మహాలక్ష్మి పథకం అమలు కాకపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తులం బంగారం ఇస్తామన్న హామీ దేవుడెరుగు, కనీసం ఆడబిడ్డలు గౌరవంగా జరుపుకునే బతుకమ్మ పండుగకు చీరలు కూడా పంపిణీ చేయలేని దౌర్భాగ్య స్థితిలో ఈ ప్రభుత్వం ఉందని విమర్శించారు.



కాంగ్రెస్ పాలనలో పేదరికం పెరిగిపోయిందని, మహిళలు తమ పుస్తెల తాడును తాకట్టు పెట్టాల్సిన దుస్థితి ఏర్పడిందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమైందని, సర్పంచ్‌లకు నిధులు ఇవ్వకుండా ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందని మండిపడ్డారు. ఇన్ని విఫలాల మధ్య రేవంత్ రెడ్డి అహంకారపూరితంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణ సాధకుడు కేసీఆర్ గురించి మాట్లాడుతూ, ఆయన కాలి చెప్పు ధూళికి కూడా రేవంత్ రెడ్డి సరిపోరని కేటీఆర్ ఘాటుగా వ్యాఖ్యానించారు. తన విద్యాభ్యాసంపై రేవంత్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలను ఆయన తిప్పికొట్టారు. తల్లిదండ్రులు చదువుకోమని పంపిస్తే, రేవంత్ రెడ్డి లంగా పనులు చేస్తూ, పెయింటింగులు వేసుకున్నారని తీవ్ర స్థాయిలో విమర్శించారు.

కేసీఆర్ కేవలం ఒక ప్రెస్ మీట్ పెడితేనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం వణికిపోతోందని కేటీఆర్ అన్నారు. కేసీఆర్ గనుక అసెంబ్లీకి వస్తే రేవంత్ రెడ్డి తట్టుకోలేరని, బహుశా ఆయన గుండె ఆగిపోయినా ఆశ్చర్యం లేదని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ప్రతిపక్ష నాయకుడిని చూసి భయపడే ముఖ్యమంత్రి రాష్ట్రాన్ని ఎలా పాలిస్తారని ఆయన ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవర్తన సరిగా లేదని, ఆయనకు పిచ్చి పట్టినట్లు కనిపిస్తోందని కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తన సొంత సెక్యూరిటీ సిబ్బందిని ప్రజల ముందే కొడుతున్న రేవంత్ తీరుపై ఆయన మండిపడ్డారు. ఈ విషయాన్ని రేవంత్ భార్య గీత దృష్టికి తీసుకెళ్లామని, ఆయన్ని కట్టివేయాలని సూచించామని చెప్పడం సభలో కలకలం రేపింది. ప్రభుత్వ వేధింపులను తట్టుకొని సర్పంచులుగా గెలిచిన బీఆర్ఎస్ కార్యకర్తలను కేటీఆర్ అభినందించారు. రాష్ట్రవ్యాప్తంగా అధికారుల వేధింపులు, బెదిరింపులు ఉన్నప్పటికీ గులాబీ జెండా రెపరెపలాడిందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. జనగామలో కనిపిస్తున్న ఈ ఉత్సాహం చూస్తుంటే కేసీఆర్ గారు మళ్ళీ ముఖ్యమంత్రి అయినట్లు అనిపిస్తోందని ఉత్సాహపరిచారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ కార్యకర్తలు ఇదే ఉత్సాహంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. పదవుల కోసం పార్టీలు మారిన కడియం శ్రీహరి వంటి నాయకులకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడటం తెలంగాణ డీఎన్ఏలోనే ఉందని, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య వంటి వీరులు పుట్టిన ఈ గడ్డపై అన్యాయాన్ని సహించబోమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మళ్ళీ బీఆర్ఎస్ ప్రభంజనం మొదలైందని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ అరాచక పాలనను అంతం చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, కార్యకర్తలు ధైర్యంగా ఉండి ప్రజల పక్షాన పోరాడాలని ఆయన దిశానిర్దేశం చేశారు. తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడేది కేవలం గులాబీ జెండా మాత్రమేనని ఆయన పునరుద్ఘాటించారు.

# తెలంగాణ గర్వకారణం ఓరుగల్లు కోట

- తెలంగాణ రాజకీయాల్లో మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది
- మంత్రి కిషన్‌రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు
- వరంగల్ కోట భూములను కాపాడాలని గట్టిగా కోరారు
- అక్కడ జరుగుతున్న అక్రమ కట్టడాలను అడ్డుకోవాలన్నారు
- ఓరుగల్లు నగరం ఆక్రమణల కోరల్లో చిక్కుకుందని వెల్లడించారు
- వరంగల్ కోట ప్రజల భావోద్వేగాలతో కూడిన అంశమ రాసుకొచ్చారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. వరంగల్ చారిత్రక వారసత్వ సంపదను కాపాడాలనే సంకల్పంతో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఒక బహిరంగ లేఖ రాశారు. ఈ లేఖలో ఆయన ప్రధానంగా వరంగల్ కోట భూములను భారత పురావస్తు శాఖ పరిధిలోకి తీసుకురావాలని, అక్కడ జరుగుతున్న అక్రమ కట్టడాలను అడ్డుకోవాలని గట్టిగా కోరారు. దాదాపు 250 ఏళ్ల పాటు కాకతీయుల వైభవానికి రాజధానిగా విరాజిల్లిన ఓరుగల్లు నగరం నేడు ఆక్రమణల కోరల్లో చిక్కుకోవడం పట్ల ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మన పూర్వీకులు అందించిన ఈ అద్భుతమైన నిర్మాణాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన గుర్తుచేశారు. వరంగల్ కోట కేవలం రాళ్లతో కట్టిన కట్టడం మాత్రమే కాదు, అది కాకతీయ వీరుల శౌర్య పరాక్రమాలకు సజీవ సాక్ష్యం. శత్రువుల దండయాత్రల నుంచి రాజ్యాన్ని రక్షించుకునేందుకు ఏడు ప్రాకారాలతో ఎంతో పకడ్బందీగా నిర్మించిన ఈ కోట, ఇంజనీరింగ్ అద్భుతమని కిషన్‌రెడ్డి కొనియాడారు. ఢిల్లీ సుల్తానులు మొదలుకొని నిజాం నవాబుల దాడుల వరకు ఎన్నో చారిత్రక ఘట్టాలను చవిచూసిన ఈ నేల, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచింది. ఇక్కడ దాగి ఉన్న శిల్ప సంపద, అద్భుతమైన దేవాలయాలు మరియు నిర్మాణ శైలి ప్రతి రోజూ వేలాది మంది పర్యాటకులను ఆకర్షిస్తోందని ఆయన తన లేఖలో సవివరంగా ప్రస్తావించారు.

వరంగల్ పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తన వంతు కృషి చేస్తోందని కిషన్‌రెడ్డి వివరించారు. ముఖ్యంగా పర్యాటకుల కోసం అత్యాధునిక సౌండ్ అండ్ లైటింగ్ షోలను ఏర్పాటు చేయడంతో పాటు, పురావస్తు శాఖ ఆధ్వర్యంలో శిథిలావస్థకు చేరిన కట్టడాలను పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు. అయితే, ప్రభుత్వం ఎన్ని నిధులు ఖర్చు చేసినా, స్థానికంగా జరుగుతున్న భూ ఆక్రమణల వల్ల చారిత్రక కట్టడాల ఉనికి ప్రమాదంలో పడుతోందని ఆయన వాపోయారు.



కేంద్రం తీసుకుంటున్న చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం సహకారం తోడైతేనే ఈ వారసత్వ సంపదను పూర్తిస్థాయిలో రక్షించుకోగలమని ఆయన అభిప్రాయపడ్డారు. ఒకప్పుడు ఏడు ప్రాకారాలతో సురక్షితంగా ఉన్న ఈ కోటలో ప్రస్తుతం కేవలం మూడు ప్రాకారాలు మాత్రమే మిగిలి ఉండటం విచారకరమని కేంద్రమంత్రి పేర్కొన్నారు. మిగిలిన ప్రాకారాల చుట్టూ ఉన్న భూములను కొందరు వ్యక్తులు చట్టవిరుద్ధంగా ఆక్రమించుకుని ఇళ్లు, వాణిజ్య కట్టడాలు నిర్మిస్తున్నారని ఆయన ఫిర్యాదు చేశారు. చారిత్రక కట్టడాల పరిరక్షణ చట్టం ప్రకారం పురావస్తు శాఖ పరిధిలోకి వచ్చే స్థలాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదు. కానీ, ఇక్కడ నిబంధనలను తుంగలో తొక్కి అక్రమంగా పాగా వేయడం చట్టరీత్యా నేరమని, దీనివల్ల భవిష్యత్తులో ఈ కట్టడాలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. కోట భూముల పరిరక్షణ కోసం ఇప్పటికే పురావస్తు శాఖ అధికారులు ఆక్రమణదారులకు పలుమార్లు నోటీసులు జారీ చేసినట్లు కిషన్‌రెడ్డి వెల్లడించారు. అయినప్పటికీ ఆక్రమణదారులు వెనక్కి తగ్గకపోగా, మరిన్ని అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తానే స్వయంగా గతంలో కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రిగా ఉన్న సమయంలోనూ, అలాగే ఇటీవల 2025 డిసెంబర్‌లోనూ జిల్లా యంత్రాంగానికి లేఖలు రాసినట్లు గుర్తు చేశారు. అయితే, అధికారుల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన లేకపోవడం వల్లే ఇప్పుడు నేరుగా ముఖ్యమంత్రికి లేఖ రాయాల్సి వచ్చిందని ఆయన వివరించారు. జిల్లా కలెక్టర్ ఈ విషయంలో ఎందుకు నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం పంపిన విన్నపాలను, అధికారుల నివేదికలను పట్టించుకోకపోవడం వల్ల ఆక్రమణదారులకు బలం చేకూరుతోందని ఆయన విమర్శించారు. చట్టాన్ని అమలు చేయాల్సిన బాధ్యత గల అధికారులు మౌనంగా ఉంటే, అది చారిత్రక వారసత్వానికి తీరని ద్రోహం చేసినట్లే అవుతుందని ఆయన స్పష్టం చేశారు. తక్షణమే జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి, కోట భూముల్లో ఉన్న అక్రమ కట్టడాలను తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ సంస్కృతిని, చరిత్రను గౌరవించే ప్రభుత్వం అని చెప్పుకునే రేవంత్ రెడ్డి సర్కార్, ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని కిషన్‌రెడ్డి కోరారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర సంపదను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని, ముఖ్యమంత్రి స్వయంగా జోక్యం చేసుకుంటేనే సమస్య కొలిక్కి వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కాకతీయుల కీర్తిని దశదిశలా చాటిచెప్పే వరంగల్ కోటను ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే అవకాశం ఉన్నా, ఇలాంటి అక్రమ కట్టడాల వల్ల ఆ ప్రయత్నాలు కుంటుపడుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వరంగల్ కోట పరిరక్షణ కేవలం ఒక శాఖకు సంబంధించిన విషయం కాదని, అది తెలంగాణ ప్రజల భావోద్వేగాలతో కూడిన అంశమని కిషన్‌రెడ్డి లేఖలో రాసుకొచ్చారు.

# ఎమ్మెల్యేకి నూతన సంవత్సర శుభాకాంక్షలు

**తెలిపిన బత్తుల విప్లవ్ గౌడ్**



**చౌటుప్పల్, విశాలభారతి:** పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు బత్తుల విప్లవ కుమార్ గౌడ్ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ కి చెందిన పలువురు మున్సిపాలిటీ నాయకులు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ని హైదరాబాదులోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వారికి శాలువాతో ఘనంగా సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ మునుగోడు ప్రజలకు మరియు నా శ్రేయోభిలాషులకు,మిత్రులకు నూతన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుర్వి నరసింహ గౌడ్,జిల్లా మత్స్య కార్మిక సంఘం అధ్యక్షులు పాశం సంజయ్ బాబు,నాయకులు కొందూరు వెంకటయ్య,కొయ్యడ సైదులు గౌడ్, కామిశెట్టి శైలజ భాస్కర్,సుర్కటి చిన్న వెంకటరెడ్డి,అంతటి బాలరాజు గౌడ్,కొరగోని లింగస్వామి,పాక చిరంజీవి యాదవ్,మలిగే మల్లేశం,శంకర్,బాలరాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# రెండు ఇండ్లలో చోరీ చేసిన గుర్తు తెలియని వ్యక్తులు



**దేవరుప్పుల, విశాలభారతి:** మండలకేంద్రానికి చెందిన శివరాత్రి రాజు తన ద్విచక్ర వాహనాన్ని సాయంత్రం ఇంటిముందు పార్క్ చేసి ఉదయం లేచి చూసేసరికి ద్విచక్ర వాహనం కనిపించలేదు. అదే గ్రామానికి చెందిన రెడ్డి రాజుల కొండయ్య గత మూడు నెలల నుండి హైదరాబాద్ లో జీవనోపాధి కోసం ఉంటున్నాడు. సోమవారం ఉదయం 9:00గంటలకు వచ్చి చూసుకునేసరికి అతని ఇంటి గేటు తాళం,ఇంటి డోర్ తాళం పగలగొట్టి కనిపించాయి.అనుమానం వచ్చి ఇంట్లోకి వెళ్లేసరికి బీరువా కూడా పగలగొట్టి అందులో ఉన్న వెండిని(సుమారు రూ.12,500)గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారని తెలిపాడు.బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఊర సృజన్ కుమార్ తెలిపారు.

# విద్యుత్ షాక్‌తో గేదె మృతి



**దేవరుప్పుల, విశాలభారతి:** దేవరుప్పుల మండలం నిర్మాల గ్రామానికి చెందిన ఎడమ రాజేందర్ రెడ్డి గేదె (బర్రె) రోజువారీగా మేతమేస్తూ సమీపంలోని ట్రాన్స్ఫారం వద్ద షాక్ తగిలి ఆకస్మికంగా మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. ఈ సంఘటనలో బాధిత రైతుకు తీవ్ర నష్టం వాటిలిందని కుటుంబ సభ్యులు శోకాయుక్తంలో మునిగారు. అనూహ్యంగా జరిగిన ఈ ప్రమాదంపై సంబంధిత అధికారులు స్పందించి ప్రభుత్వం నిబంధనల ప్రకారం తగిన సహాయం నష్టపరిహారం అందజేయాలని రైతు కుటుంబం మరియు గ్రామస్తులు కోరుతున్నారు.

# బెల్లం వ్యాపారికి రూ.65000 జరిమానా



**విశాలభారతి, ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి:** ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలానికి చెందిన ముక్క శ్రీనివాస్ అనే బెల్లం వ్యాపారి పలుమార్లు బెల్లం , పటిక అమ్ముతూ పట్టుబడితే నేరడిగొండ తహసీల్దార్ దగ్గర బైండోవర్ చేయించడం జరిగింది, మళ్ళీ బెల్లం, పటిక అమ్ముతూ పట్టుబడ్డాడు. బైండోవర్ ఉల్లంగిచినందున ముక్క శ్రీనివాస్ వ్యాపారి చే ఈ రోజు ఛలాన్ రూపం లో 50,000 రూపాయలను కట్టించినట్లు, బోరిగాం గ్రామానికి చెందిన రాథోడ్ ఉత్తం గుడుంబా అమ్ముతూ పట్టు బడుతే రూ.15,000 జరిమానా విధించారు సదరు వ్యక్తులతో ఈ రోజు ఛలా్‌రూపంలో 65,000 రూపాయలు కట్టించినట్లు ఎక్సైజ్ ఇన్ స్పెక్టర్ జుల్ఫికర్ అహ్మద్ తెలిపినారు.ఎవరైనా బెల్లం గానీ , గుడుంబా గానీ ,అమ్మిన , కలిగి ఉన్న కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ ఇన్ స్పెక్టర్ జుల్ఫికర్ అహ్మద్ తెలిపినారు.

# తార్నాక డీసీని కలిసిన నేతలు




**సికింద్రాబాద్, విశాలభారతి:** జిహెచ్ఎంసి తార్నాక డిప్యూటీ కమిషనర్ గా నూతనంగా నియమి తులైన జ్యోతిని బిజెపి సీనియర్ నాయకుడు నగరపు శ్యామ్ నాయ కులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. సికింద్రాబాద్ సర్కిల్ జిహెచ్ఎంసి కార్యాలయంలో మంగళవారం కలిసి పుష్పగుచ్ఛం అంద జేసారు . నూతనంగా ఏర్పడిన సర్కిల్ పరిధిలో తన వంతు సహకారం అందజేస్తానని. పలు ప్రాంతాల్లో ఉన్నటువంటి ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు వివరిస్తామని నాయకులు తెలిపారు. డిప్యూటీ కమిషనర్ జ్యోతి మాట్లాడుతూ.. తన దృష్టికి వచ్చిన ప్రజా సమస్యలను సిబ్బందితో కలిసి వెంటనే సమస్యను పరిష్కరిస్థామని అన్నారు .ప్రజలకు అందుబాటులో ఉంటానని డిప్యూటీ కమిషనర్ జ్యోతి చెప్పారు.

# నూతన క్యాలెండర్ ఆవిష్కరించిన తిరుపతిరెడ్డి



**కోడంగల్, విశాలభారతి:** నియోజకవర్గ కేంద్రంలోని కాడ కార్యాలయంలో ఇవాళ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సోదరుడు కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఎనుముల తిరుపతిరెడ్డి మరియు కొడంగల్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో హెచ్ఎంటీవీ నూతన సంవత్సర క్యాలెండర్ ను ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎనుముల తిరుపతిరెడ్డి మరియు కడ ప్రత్యేకధికారి వెంకటరెడ్డిలు మాట్లాడుతూ.. హెచ్ఎంటీవీ యాజమాన్యానికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.గత 16 సంవత్సరాలుగా హెచ్ఎంటీవీ ప్రజలకు, ప్రభుత్వాలకు వారధిగా ఉంటూ అనేక సమస్యల పరిష్కారానికి వేదికగా పనిచేస్తుందని కొనియాడారు. ఇకముందు కూడా ప్రజాహితం కోసం హెచ్ఎంటీవీ అనేక కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గ ముఖ్యనాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరైయ్యారు.

# ప్రజల భద్రతకే వీధిదీపాలు ఏర్పాటు

**మంగళగూడెం గ్రామ సర్పంచ్ కొట్టం నరేందర్ రెడ్డి**

**కేశంపేట, విశాలభారతి:** ప్రజల భద్రత, సౌకర్యం దృష్ట్యా వీధిదీపాలు ఏర్పాటు చేయడం జరిగిందని మండల పరిధిలోని మంగళగూడెం గ్రామ సర్పంచ్ కొట్టం నరేందర్ రెడ్డి అన్నారు.మంగళవారం గ్రామంలో వీధిదీపాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీకటి సమస్యను తొలగించి, రాత్రి సమయంలో ప్రజలకు భద్రత కల్పించడమే ప్రధాన ఉద్దేశ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ యెషమోని రాధాకృష్ణ,వార్డ్ మెంబర్ బట్టు సుధాకర్, ఓబీసీ సెల్ అధ్యక్షుడు చుక్క విమోచన, బట్టు యాదగిరి,కొట్టం కరుణాకర్ రెడ్డి,సిద్దేశి యాదయ్య,నిడదవెల్లి ప్రకాష్ చారి,గ్రామస్తులు పాల్గొన్నారు.

# దేవాలయాల పరిరక్షణ మనందరి బాధ్యత

**చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు సీఎస్ రంగరాజన్**



**మొయినాబాద్, విశాలభారతి:**

దేశంలో దేవాలయాల పరిరక్షణ మనందరి బాధ్యత అని, సనాతన ధర్మరక్షణకు ఇది అత్యంత అవసరమని, చిలుకూరు బాలాజీ ప్రధాన అర్చకులు రంగరాజన్ పేర్కొన్నారు. మంగళవారం మొయినాబాద్ మండల పరిధిలోని మోత్కుపల్లి గ్రామంలోని శతాబ్దానికి పైగా చరిత్ర కలిగిన శ్రీ చెన్నకేశవ దేవాలయాన్ని ఆయన సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా రంగరాజన్ మాట్లాడుతూ.. మోత్కుపల్లి గ్రామంలో నవాబుల కాలంలో మోత్కుపల్లి గ్రామంలో ఉన్న చెన్నకేశవ దేవాలయాన్ని ఔరంగజేబు కూల్చడం జరిగిందని, దానిని ప్రస్తుతం అభివృద్ధి చేసి భక్తులకు దర్శనానికి కృషిచేయడం మోత్కుపల్లి సర్పంచ్ సంపూర్ణ రాములును ఆయన అభినందించారు. చెన్నకేశవ దేవాలయ అభివృద్ధి పనులు దేశానికి ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు. గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు, నూతన సర్పంచ్ సంపూర్ణ రాములు గెలుపొందిన రెండో రోజు నుండి దేవాలయ అభివృద్ధి పనులు ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఈనెల 14, 15 తేదీలలో జరగనున్న చెన్నకేశవ స్వామి ఉత్సవాలకు ఆలయాన్ని అంగరంగ వైభవంగా సిద్ధం చేస్తున్నారని తెలిపారు. ఆలయ పునర్నిర్మాణంతో పాటు ఉత్సవ ఏర్పాట్లు వేగవంతంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. 1936 వరకు అణగారిన వర్గాలకు దేవాలయ ప్రవేశం లేకపోయిన పరిస్థితులను గుర్తు చేస్తూ.. అలాంటి సామాజిక నేపథ్యం నుంచి వచ్చిన సర్పంచ్ సంపూర్ణ రాములు దేవాలయ అభివృద్ధికి ముందడుగు వేయడం సామాజిక సమానత్వానికి, సనాతన ధర్మ విలువలకు నిదర్శనమని, రంగరాజన్ అన్నారు. గతంలో నవాబుల కాలంలో ఔరంగజేబు ఈ దేవాలయాన్ని కూల్చివేయగా.. గ్రామ ప్రజలు అప్పటి ముఖ్యమంత్రి టీ.అంజయ్య ఆధ్వర్యంలో ఆలయాన్ని తిరిగి నిర్మించారని తెలిపారు. అప్పటి నుంచి ఈ దేవాలయం భక్తులకు నిరంతరం దర్శన భాగ్యాన్ని కల్పిస్తోందన్నారు. గ్రామస్తులందరూ ఏకమై దేవాలయ అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమని, పేర్కొనారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ ప్రజలను మరియు సర్పంచ్ సంపూర్ణ రాములను రంగరాజన్ ప్రత్యేకంగా అభినందించారు.

# రామగుండం ప్రజలపై అయ్యప్ప స్వామి దీవెనలు ఉండాలి

- తెలంగాణకు మళ్ళీ కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యేలా దీవించాలి
- పెద్దపల్లి జిల్లా బిఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్



**విశాలభారతి, గోదావరిఖని:**

అయ్యప్ప స్వామి దీవెనలు ఈ ప్రాంత ప్రజలపై, కార్మికులపై, కర్షకులపై ఉండాలనీ, తెలంగాణకు మళ్ళీ కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యేలా ఆ అయ్యప్ప దీవించాలనీ రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అయ్యప్పస్వామి వారిని వేడుకున్నారు. రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ 31 వ సారి అయ్యప్ప స్వామి మాలధారణ తీసుకుని 41 రోజుల మండల దీక్షను పూర్తి చేసుకుని స్థానిక అయ్యప్పస్వామి వారి ఆలయంలో ఇరుముడి ధరించి శబరిమలై వెళుతున్న సందర్భంగా మంగళవారం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కుమారుడు మణిదీప్ తో కలిసి గోదావరిఖని శ్రీ కోదండరామలయం లోని అయ్యప్పస్వామి ఆలయంలో గురుస్వామి చేత పూజ కార్యక్రమాలను నిర్వహించి, ఇరుముడి కట్టుకుని కుటుంబ సభ్యుల, అభిమానుల, బీఆర్ఎస్ పార్టీ నాయకుల సమక్షంలో ఇరుముడితో శబరిమలైకు బయలుదేరారు. అంతకుముందు ఇరుముడితో అయ్యప్ప ఆలయంలో, శివాలయంలో, రామాలయంలో ప్రదక్షిణలు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ రామగుండం ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని, ఆయురారోగ్యాలతో జీవించాలని అయ్యప్ప స్వామినీ వేడుకున్నారు. గత 31 సంవత్సరాలుగా తాను అయ్యప్ప దీక్షను తీసుకున్నానని, ఐదు సార్లు పెద్దపాదం ద్వారా స్వామి వారిని కొండలు వెళ్ళి దర్శనం చేసుకోవడం జరిగిందన్నారు. ఈసారి కూడా పెద్దపాదం ద్వారా శబరిమలై దర్శనం చేసుకోవడం జరుగుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణాలో కేసీఆర్ ప్రభుత్వం రావాలని, త్వరలో జరుగబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో బీ.ఆర్.ఎస్ పార్టీ కార్పొరేటర్లు అధిక సంఖ్యలో గెలిచి, మేయర్ పీఠాన్ని కైవసం చేసుకునేలా ప్రజలు, ఆ అయ్యప్ప స్వామి దీవించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో బీ.ఆర్.ఎస్ పార్టీ నాయకులు పాముకుంట్ల భాస్కర్ పెంట రాజేష్ నారాయణదాసు మారుతి, కల్వచర్ల కృష్ణవేణి బాదే అంజలి గాధం విజయ బోడ్డుపల్లి శ్రీనివాస్ పిల్లి రమేష్ మేతుకు దేవరాజ్ కరవేది శ్రీనివాస్ రెడ్డి ముద్దసాని సంధ్యారెడ్డి బుర్రి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉరేసుకొని యువతి మృతి

- మృతురాలు అశ్వాపురం వాసి
- ఆదివారం సుమారు 5 గంటలకు హాస్టల్లోనే ఘటన
- ఓ యువకుడె కారణం అంటున్న కుటుంబీకులు
- యువకుడు ఇంటిముందు ఆందోళన



**అశ్వాపురం, విశాలభారతి :**

అనుమానాస్పద స్థితిలో హైదరాబాదులోని ఎల్బీ నగర్ సమీపంలో గల ప్రభుత్వ వసతి గృహంలో నివాసముంటున్న కనుకు సరస్వతి (21) ఈ నెల నాలుగో తేదీ ఆదివారం సాయంత్రం సుమారు 5 గంటల ప్రాంతంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలు ఏడాది నుండి కంప్యూటర్లో కోచింగ్ కు వెళ్లినట్లు కుటుంబీకులు చెబుతున్నారు. అయితే ఓ రెండు నెలల నుండి ఓ ప్రైవేట్ కాల్ సెంటర్లో పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. మృతురాలుకి అశ్వాపురం గ్రామానికి చెందిన పాలడుగు నందకిషోర్ అనే యువకుడితో ప్రేమలో ఉన్నట్లు తెలుస్తోంది. మృతికి కారణం ఆ యువకుడేనని ఆరోపిస్తూ మంగళవారం మృతురాలి తల్లిదండ్రులతో పాటు బంధువులు అశ్వాపురం మండల కేంద్రంలోని ఆర్ అండ్ బి ప్రధాన రహదారిపై ఆందోళనకు దిగారు. సుమారు ఒకగంట పాటు ఆందోళన కొనసాగించారు. ఆందోళన చేస్తున్న వద్దకు అశ్వాపురం ఎస్సై రాజేష్ సిబ్బందితో వచ్చి ఆందోళకారులకు నచ్చజెప్పి విరమింప చేశారు. రోడ్డుపై ఆందోళన విరమించిన మృతురాలి బంధువులతో పాటు కుటుంబీకులు నందకిషోర్ స్వగ్రామమైన అశ్వాపురంలో వారు నూతనంగా నిర్మించుకుంటున్న ఇంటిముందు టెంటు వేసి మృతదేహంతో సహా ఆందోళన చేపట్టారు. మృతురాలి కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఆందోళన కొనసాగిస్తామని కుటుంబ సభ్యులు తెలుపుతున్నారు.

# తెలంగాణ కార్మిక సమైక్య రాష్ట్ర కార్యదర్శిగా ఏసు పాదం



**సన్మానించిన టీకేఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు కలకోటి రామన్న**

**దేవరుప్పల, విశాలభారతి:**

దేవరుప్పుల మండలంలోని కడవెండి గ్రామానికి చెందిన పడమటింటి ఏసు పాదం తెలంగాణ కార్మిక సమైక్య రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైనట్లు తెలంగాణ కార్మిక సమైక్య వ్యవస్థాపక అధ్యక్షులు కలకోటి రామన్న ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం హైదరాబాద్ బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీకేఎస్ రాష్ట్ర నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ కార్మిక సమైక్య రాష్ట్ర కార్యదర్శిగా పడమటింటి ఏసు పాదంను టీకేఎస్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా జనగామ జిల్లా ఇన్చార్జిగా ప్రకటించినట్లు టీకేఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు కలకోటి రామన్న తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన టీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏసు పాదం మాట్లాడుతూ గ్రామపంచాయతీ పారిశుద్ధ కార్మికులను హైదరాబాద్ మున్సిపల్ జిహెచ్ఎంసి కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్య వైద్యం ఉద్యోగం ఉపాధి కల్పించాలని గతకొన్ని సంవత్సరాలుగా ప్రజల కార్మికుల పక్షాన నిరంతరం వారి హక్కుల సాధనకై అలుపెరుగని పోరాటం చేస్తున్నది టీకేఎస్ అని అన్నారు. కార్మికులకు న్యాయం జరిగే విధంగా భవిష్యత్ కార్యాచరణ రూపొందించి తెలంగాణ రాష్ట్రంలో వివిధ రూపాలలో పోరాటం చేయడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిటిఎస్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంధాల యాదగిరి ఈశ్వర్ అలవాల వెంకన్న సన్నీ చంద్రయ్య నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సహాయనిధి నిరుపేదలకు వరం

**నిర్దవెళ్ళి గ్రామ సర్పంచ్ భాస్కర్ గౌడ్**



**కేశంపేట, విశాలభారతి:** సీఎం సహాయనిధి నిరుపేదలకు వరం అని నిర్దవెళ్లి గ్రామ సర్పంచ్ భాస్కర్ గౌడ్ అన్నారు.మంగళవారం నిర్దవెళ్లి గ్రామానికి చెందిన మూడవత్ బిక్యా 29వేల 500, బడ్క శిరీషకు 11వేలకు సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు గ్రామ ప్రజాప్రతినిధులతో కలిసి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్య బాధితులకు ఆరోగ్యశ్రీతో పాటు అత్యవసర పరిస్థితుల్లో ఇబ్బందులు నివారించే దిశగా సీఎం సహాయనిధి ద్వారా చెక్కులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో అందజేస్తున్నామని వెల్లడించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సఫూరా ఆమేర్,వార్డు సభ్యులు చంద్రయ్య, రమేష్, రిజ్వానబేగం మోహిజ్, వెంకటమ్మ మల్లయ్య,ఎమ్మార్పీయస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు సిల్వేర్ చిన్న మల్లయ్య,నాయకులు వెంకట్ రెడ్డి, జంగయ్య, శ్రీశైలం, ఖాజాపాషా, బడ్క మల్లయ్య, ముత్యాలు, బద్రుద్దిన్, వీరస్వామి, మల్లయ్య, రమేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# శివ దీక్ష స్వీకరించిన భక్తులకు అన్నప్రసాదం



**కేశంపేట, విశాలభారతి:** మండల కేంద్రంలోని శివాలయంలో దీక్ష స్వీకరించిన శివ స్వాములకు మండల కేంద్రానికి చెందిన బిజెపి యువ నాయకులు తలసాని పవన్ కుమార్ రెడ్డి అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివ భక్తులకు సేవ చేయడం ద్వారా మానసిక ప్రశాంతత, సామాజిక ఐక్యత పెరుగుతాయని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో మానవత్వం, సౌభ్రాతృత్వాన్ని మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో శివస్వాములు పాండు, మహేష్, రమణ, శివ,సురేష్, శేఖర్ లు పాల్గొన్నారు.

# మానవ అక్రమ రవాణాను అరికడుదాం

**ఏహెచ్ టీయూ హెడ్ కానిస్టేబుల్ అల్లిమోద్దీన్**



**మర్పల్లి, విశాలభారతి:** మానవ అక్రమ రవాణా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ ముందడుగు వేయాలని ఏ హెచ్ టీ యూ హెడ్ కానిస్టేబుల్ అల్లిమోద్దీన్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల పరిధిలోని పట్లూర్ గ్రామంలో జెడ్ పి హెచ్ ఎస్ ఉర్దూ మీడియం పాఠశాలలో మానవ అక్రమ రవాణాపై అవగాహన సదస్సు నిర్వహించారు . ఈ సందర్భంగా హెచ్ టి యు హెడ్ కానిస్టేబుల్ అలీముద్దీన్ మాట్లాడుతూ ..మానవ అక్రమ రవాణాను అరికట్టే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుందనన్నారు . పిల్లలు మహిళలు జాగ్రత్తగా ఉండాలన్నారు ఎవరైనా వ్యక్తులపై అనుమానం వస్తే 100 నెంబర్ కు లేదా 1098 కు ఫోన్ చేయాలని సూచించారు ఫోక్సో యాక్ట్ ఉంటుంది తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు ఏదైనా తినడానికి ఇస్తే తీసుకోవద్దని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి, ఉపాధ్యాయులు సత్యనారాయణ, సీమ సుల్తానా, రుబియా బేగం అనంత రాములు, అయేషా సుల్తానారమేష్, సి ఆర్ పి మల్లేశం విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను పరిష్కరించడమే మన లక్ష్యం

- పైప్ లైన్ లీకేజీలు సహా ఏ సమస్య ఉన్నా తెలియజేయండి
- సర్పంచ్ పోలేబోయిన సుజాత

**విశాలభారతి, కరకగూడెం:** గ్రామపంచాయతీలో పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు పంచాయతీ పరిధిలోని పెద్దలు చిట్టి వెంకటేశ్వర్లు గారి ఇంటి దగ్గర మెయిన్ రోడ్డు పక్కన నీటి పైప్లైన్ లీకేజ్ లను గుర్తించి తక్షణమే స్పందించి మరమ్మత్తు పనులు చేపట్టిన కరకగూడెం సర్పంచ్ పోలేబోయిన సుజాత ఈ పనులను దగ్గరుండి పర్యవేక్షించిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించడమే మన లక్ష్యం అని, ప్రజల అవసరాలకు ప్రాధాన్యత ఇచ్చి ఇలాంటి సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. గ్రామాలలో ఏటువంటి సమస్యలు ఉన్న సర్పంచ్ గారి దృష్టికి తీసుకురావాలని తక్షణ పరిష్కారానికి కృషి చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు,పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# సత్తుపల్లి మెడికల్ సిండికేట్ వ్యవహారంలో మరో మలుపు

**కొన్ని మెడికల్ షాపులకు మాత్రమే నిర్దిష్ట డిస్ట్రిబ్యూటర్ల నుంచి ప్రత్యేక సౌకర్యాలు**

**సత్తుపల్లి, విశాలభారతి :**



సత్తుపల్లిలో మెడికల్ సిండికేట్ వ్యవహారం రోజురోజుకీ కొత్త మలుపులు తిరుగుతోంది. పార్ట్-2 కథనం వెలువడిన తర్వాత అధికార వర్గాల్లో కదలికలు కనిపిస్తున్నాయన్న సంకేతాలు ఉన్నప్పటికీ, ప్రజల ముందు మాత్రం స్పష్టమైన సమాధానాలు రావడం లేదు. ఈ మౌనమే మరిన్ని అనుమానాలకు దారితీస్తోంది. డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్ ప్రకారం మెడికల్ షాపులు స్వతంత్రంగా పనిచేయాలి. కానీ సత్తుపల్లిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. లైసెన్సులు ఉన్నప్పటికీ ఏ మందులు ఎక్కువగా ఉంచాలి, ఏ బ్రాండ్‌ను ప్రోత్సహించాలి, ఏ డిస్ట్రిబ్యూటర్ వద్ద నుండి సరఫరా తీసుకోవాలి అన్న అంశాలు అనధికారంగా నిర్ణయించబడుతున్నాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. కొన్ని మెడికల్ షాపులకు మాత్రమే నిర్దిష్ట డిస్ట్రిబ్యూటర్ల నుంచి ప్రత్యేక సౌకర్యాలు, క్రెడిట్ సదుపాయాలు, అధిక మార్జిన్లు లభిస్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. దీని వల్ల చిన్న వ్యాపారులు పోటీలో నిలబడలేక వెనక్కి తగ్గాల్సి వస్తోందన్న ఆవేదన వ్యక్తమవుతోంది. ఈ ప్రక్రియలో బిల్లింగ్‌లో అవకతవకలు చోటుచేసుకుంటున్నాయన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. స్టాక్ రొటేషన్ పేరుతో కాలం చెల్లిన మందులను తిరిగి పంపించడం, అవసరం లేని మందులను బలవంతంగా విక్రయించడం వంటి చర్యలు జరుగుతున్నాయన్న ఆరోపణలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి.

డ్రగ్స్ కంట్రోల్ శాఖ తనిఖీలు క్రమం తప్పకుండా జరుగుతున్నాయా అన్న ప్రశ్నకు స్పష్టమైన సమాధానం కనిపించడం లేదు. చివరిసారి ఎప్పుడు సమగ్ర తనిఖీ జరిగింది, ఎన్ని మెడికల్ షాపులపై చర్యలు తీసుకున్నారు, ఎంతమంది లైసెన్సులు రద్దయ్యాయి అన్న వివరాలు ప్రజలకు తెలియని పరిస్థితి నెలకొంది. ఈ సమాచారం బయటకు వస్తేనే వ్యవస్థపై నమ్మకం ఏర్పడుతుందన్న అభిప్రాయం బలంగా వ్యక్తమవుతోంది. సిండికేట్‌పై మాట్లాడే వారిపై "తనిఖీలు పెడతాం", "సరఫరా నిలిపేస్తాం" అంటూ ఒత్తిళ్లు వస్తున్నాయన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఇది కేవలం వ్యాపార దందా మాత్రమే కాకుండా, భయాన్ని ఆయుధంగా మార్చుకున్న వ్యవస్థగా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ మొత్తం వ్యవహారంలో అత్యంత నష్టపోతున్నది సామాన్య ప్రజలేనని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రిస్క్రిప్షన్ లేకుండా మందుల విక్రయం, యాంటీబయాటిక్ దుర్వినియోగం, నిల్వ ప్రమాణాల లోపాలు ప్రజారోగ్యంపై దీర్ఘకాలిక ప్రభావం చూపే ప్రమాదం ఉందని వారు పేర్కొంటున్నారు. ఇది కేవలం చట్ట ఉల్లంఘన కాదు, ప్రజల ప్రాణాలతో చెలగాటమేనన్న ఆగ్రహం వ్యక్తమవుతోంది.

ఈ నేపథ్యంలో ప్రజలు ఇప్పుడు జిల్లా యంత్రాంగం, డ్రగ్స్ కంట్రోల్ శాఖ, విజిలెన్స్, ఏసీబీ వైపు ఆశగా చూస్తున్నారు. స్వతంత్ర విచారణ జరిగితేనే డబ్బు ప్రవాహాలు, ఒప్పందాల నిజ స్వరూపం, అధికారుల పాత్ర బయటపడుతుందన్న నమ్మకం వ్యక్తమవుతోంది. సత్తుపల్లి ప్రజానీకం మాటలు ఇప్పుడు మరింత ఘాటుగా మారుతున్నాయి. "చట్టం నిజంగా అందరికీ సమానమా? లేక కొందరికే రక్షణా?" అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఈ వ్యవస్థపై నిజాలు ఎప్పుడు బయటపడతాయి? అధికారుల స్పందన వస్తుందా? లేక మౌనమే ఈ సిండికేట్‌కు అతి పెద్ద బలమవుతుందా? అన్న సందేహాలు కొనసాగుతున్నాయి.

## ప్రభుత్వ న్యాయవాదిని సన్మానించిన గట్టు మొగలయ్య



**చౌటుప్పల్, విశాలభారతి:** పట్టణ పరిధిలోని జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టుకు ప్రభుత్వ న్యాయవాదిగా వాకిటి నరసింహారెడ్డి నియామకం అయిన సందర్భంగా మంగళవారం రోజున వారి సగృహంలో చౌటుప్పల్ న్యాయవాది గట్టు మొగలయ్య ముదిరాజ్ కలిసి శాలువా కప్పి ఘనంగా సన్మానించడం జరిగింది. తదనంతరం శుభాకాంక్షలు తెలపడం జరిగింది. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ న్యాయవాది వృత్తి స్వీకరించిన ప్రతి ఒక్కరు గౌరవంగా, నిజాయితీ గా ఉండాలని, కొన్ని కేసులలో తెలియని విషయాలను సీనియర్ న్యాయవాదుల సలహాలు తీసుకోవాలని, మా విధంగా కష్టపడి పనిచేసి భవిష్యత్తులో ఉన్నత పదవులు సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిలువేరు వెంకటేష్, గంగనమోని కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో జర్నలిస్టుల జోలికి వస్తే ఊరుకోం

- **సుందర్ కల్లూరి**
- **సంఘాలు కాదు జర్నలిస్టుల సంక్షేమమే మాకు ముఖ్యం**
- **జర్నలిస్టులను వేరు చేసి చూడడం తగదు**
- **చిన్న పత్రికలకు, డిజిటల్ మీడియాకు అక్రిడేషన్ ఇవ్వాలి**
- **జీవో 252 ని పునఃసమీక్షించాలి**



**శేరిలింగంపల్లి, విశాలభారతి:** తెలంగాణలోని ప్రతీ జర్నలిస్ట్ కి న్యాయం జరగాలని రిపోర్టర్లు, డెస్క్ జర్నలిస్టులు, చిన్న పత్రికలు, డిజిటల్ మీడియా అంటూ వేరు చేయడం తగదని, జీవో 252 ని పునఃసమీక్షించాలని, అర్హులైన ప్రతీ జర్నలిస్ట్ కి అక్రిడేషన్ కార్డు ఇవ్వాలని, ప్రభుత్వం నుండి రావాల్సిన సంక్షేమ పథకాలన్నీ జర్నలిస్టులకు అందాలని తెలంగాణ జర్నలిస్ట్ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు సుందర్ కల్లూరి డిమాండ్ చేసారు. తెలంగాణ వ్యాప్తంగా విధి నిర్వహణలో ఉన్నటువంటి జర్నలిస్ట్ ల జోలికి వస్తే మాత్రం ఎంతటి వారైనా సరే ఉపేక్షించే ప్రసక్తే లేదంటూ హెచ్చరించారు. మీకు జరిగిన ఇబ్బంది మా దృష్టికి తీసుకొస్తే, తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం మీ దగ్గరికి వచ్చి మీకు కొండంత అండగా ఉంటుందని జర్నలిస్టులందరికీ భరోసా ఇచ్చారు. ఈ నేపథ్యంలో మంగళవారం తెలంగాణ జర్నలిస్ట్ సంక్షేమ సంఘం కార్యాలయంలో అధ్యక్షుడు ఆనం చిన్ని వెంకటేశ్వర్ రావు అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశంలో ఉపాధ్యక్షుడు సుందర్ కల్లూరి, తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌటి రామకృష్ణ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కీర్తి సంతోష్‌రాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు వేణుగోపాల్, గ్రేటర్ హైదరాబాద్ నగర ప్రధాన కార్యదర్శి సాయి గౌడ్, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## నేడే విద్యుత్ వినియోగదారుల సదస్సు

- **జనవరి 8న గంగారం 33/11 కె.వి సబ్‌స్టేషన్**
- **వినియోగదారుల కోర్టు ఏ.డి.ఈ ప్రసాద్ బాబు పిలుపు**
- **విద్యుత్ సమస్యల పరిష్కారానికి వినియోగదారుల కోర్టు ఏర్పాటు**
- **ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఫిర్యాదుల స్వీకరణ**
- **రాతపూర్వకంగా ఫిర్యాదులు అందించాలని సూచన**



**సత్తుపల్లి, విశాలభారతి:** విద్యుత్ వినియోగదారుల సదస్సును సద్వినియోగం చేసుకోవాలని ఏ.డి.ఈ ప్రసాద్ బాబు మంగళవారం తెలిపారు. మండల పరిధిలోని గంగారం గ్రామంలోని 33/11 కె.వి సబ్ స్టేషన్‌లో ఈ నెల 8వ తేదీ గురువారం విద్యుత్ వినియోగదారుల కోర్టును ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. సిజిఆర్ఎఫ్1 చైర్‌పర్సన్ వేణుగోపాల చారి ఆదేశాల మేరకు సబ్ స్టేషన్ కార్యాలయంలో ఈ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వినియోగదారుల కోర్టులో ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంటల వరకు విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదులను స్వీకరిస్తామని చైర్‌పర్సన్ వేణుగోపాల చారి తెలిపారు. విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల మార్పు, వోల్టేజ్ హెచ్చు తగ్గుదల, డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ పెంపుదల, లోపాలు ఉన్న మీటర్ల మార్పు, నూతన సర్వీసుల మంజూరు, అదనపు లోడ్ క్రమబద్ధీకరణ, సర్వీసుల పేరు మార్పు, వాడకానికి తగని అధిక బిల్లులు, కేటగిరీ మార్పు, సర్వీస్ రద్దు తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులను వినియోగదారులు రాతపూర్వకంగా అందించవచ్చని తెలిపారు. కావున టీజీఎన్‌పీడీసీఎల్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అవసరమైన సమాచారం కోసం ఎన్.వి. వేణుగోపాల చారి (చైర్‌పర్సన్) సెల్ నంబర్ 8712481313, కే. రమేష్ (మెంబర్-టెక్నికల్) 8712481314, ఎన్.దేవేందర్ (మెంబర్-ఫైనాన్స్) 8712481316, ఎం.రామారావు (ఇండిపెండెంట్ మెంబర్) 8712481485 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ విద్యుత్ వినియోగదారుల సదస్సు ద్వారా సమస్యలు వెంటనే పరిష్కారం అవుతాయని, ప్రతి వినియోగదారుడు ఈ సదస్సును వినియోగించుకుని లబ్ధి పొందాలని ఏ.డి.ఈ ప్రసాద్ బాబు విజ్ఞప్తి చేశారు.

## అమెరికా సామ్రాజ్యవాదం నశించాలి

- **వెనిజులాపై దాడిని ఖండించిన సిఐటియు**
- **వెనిజులాపై అమెరికా దౌర్జన్య చర్యలకు వ్యతిరేకంగా సిఐటియు నిరసన**
- **అధ్యక్షుడు నికోలాస్ మదురో, ఆయన భార్యను వెంటనే విడుదల చేయాలని డిమాండ్**
- **అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనగా అమెరికా చర్యలను ఖండించిన సిఐటియు**



**సత్తుపల్లి, విశాలభారతి:** సిఐటియు సత్తుపల్లి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బస్టాండ్ సర్కిల్‌లో ప్లకార్డులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కోలికపోగు సర్వేశ్వరరావు మాట్లాడుతూ, అమెరికా వెనిజులాపై చేపట్టిన దౌర్జన్య చర్యలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని సిఐటియు ఆల్ ఇండియా కమిటీ పిలుపునిచ్చిందన్నారు. తప్పుడు కేసుల పేరుతో వెనిజులా అధ్యక్షుడిపై, అక్కడి పౌరులపై క్రూరమైన దాడులు జరిపిన అనంతరం వెనిజులా అధ్యక్షుడు నికోలాస్ మదురోను ఆయన భార్య సిరియా ఫ్లోరెస్‌తో సహా అమెరికా దళాలు భారీ స్థాయిలో దాడి నిర్వహించి అరెస్టు చేయడం అంతర్జాతీయ చట్టాలకు స్పష్టమైన ఉల్లంఘనగా పేర్కొన్నారు. ఇది అమెరికా సామ్రాజ్యవాదానికి నిదర్శనమైన భయంకరమైన చర్యగా సిఐటియు భావిస్తోందన్నారు. ప్రజాస్వామ్యం, సామాజికవాద విలువలను గౌరవించే సంస్థగా, సామ్రాజ్యవాద శక్తులకు వ్యతిరేకంగా పోరాడుతున్న వెనిజులా ప్రజలతో సిఐటియు సంపూర్ణ సంఘీభావం ప్రకటిస్తోందని తెలిపారు. అమెరికా వెనిజులాపై చేసిన కక్షపూరిత చర్యలకు బాధ్యత వహించి, వెనిజులా అధ్యక్షుడు నికోలాస్ మదురోను ఆయన భార్యతో సహా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## రామగుండాన్ని మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దుతా

- **అసంపూర్తిగా ఉన్న కొత్త ప్రభుత్వ ఆసుపత్రిని పూర్తి చేయాలి**
- **క్యాథ్ ల్యాబ్ ను ప్రారంభించాలి**
- **ప్రభుత్వాన్ని కోరిన రామగుండం శాసనసభ్యులు ఎం ఎస్ రాజ్ ఠాకూర్**




**విశాలభారతి , గోదావరిఖని:**

రామగుండం కార్మిక క్షేత్రంలో ప్రజల అవసరం కోసం పూర్తిస్థాయిలో వైద్యం అందడం లేదని, ఇందుకోసం మరిన్ని నిధులు కేటాయించాలని రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ అసెంబ్లీ సమావేశాలలో స్పష్టం చేశారు. సుమారు 3 లక్షల జనాభా ఉన్న కోల్ బెల్టు ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి సరిపోవడం లేదని పేర్కొన్నారు. అయితే 140 కోట్ల వ్యయంతో కొత్తగా నిర్మిస్తున్న ఆసుపత్రిని పూర్తి చేయాలని కోరారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఆసుపత్రిని పూర్తిచేస్తే ప్రజలకు వైద్య అవసరాలు తీర్చినట్లు అవుతుందన్నారు. అదేవిధంగా ప్రభుత్వ ఆస్పత్రిలో మందుల కొరత లేకుండా చూడాలన్నారు. ఇక్కడున్న ప్రభుత్వ ఆసుపత్రిలో నిత్యం 2వేల వరకు ఆవుట్ పేషెంట్లు వస్తూ ఉంటారని. వారికి అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలన్నారు. 20 కోట్లతో నిర్మించిన క్యాథ్ ల్యాబ్ ను ప్రారంభించాలని సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులను ఎమ్మెల్యే కోరారు. పారిశ్రామిక ప్రాంతంలో అధికంగా కాలుష్యం వల్ల గుండెపోటు మరణాలు ఎక్కువవుతున్నాయని వాటిని నివారించేందుకు అధునాతన వైద్య పరికరాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఇప్పటికే సింగరేణి సంస్థ, ఎన్టీపీసీ విద్యుత్ పరిశ్రమ సంబంధించిన సి ఎస్ ఆర్ నిధులతో ఆసుపత్రులను మరింతగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. అయితే గతంలో సింగరేణికి సంబంధించిన 500 కోట్ల నిధులతో మెడికల్ కాలేజీని నిర్మించగా ప్రస్తుతం అందులో మరిన్ని సదుపాయాల కోసం నిధులు కేటాయించాలని కోరారు. ఈ ప్రాంతాన్ని మెడికల్ హబ్‌గా తీర్చిదిద్ది, పూర్తిస్థాయిలో వైద్యం అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయాలని ఆయన కోరారు.

## విద్యార్థినిలను అభినందించిన సిఐ సతీష్ కుమార్



- **జాతీయ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్-2026**
- **పాల్వంచ మహిళా విద్యార్థినిల ప్రతిభ**

**పాల్వంచ, విశాలభారతి:**

జాతీయ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ 2026 అవార్డ్ ఈనెల 4న పారకాలలోని మయూరి గార్డెన్ పంక్షన్ హాల్ లో జరిగింది. ఈ పోటీలో పాల్వంచ మేరీ తైక్వాండో అసోసియేషన్ విద్యార్థినిలు గెలుపొంది అవార్డులుసాధించారు. కరాటే కోచ్ జె.మరియమ్మ, జె.రాము. విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లను పాల్వంచ (సిఐ) కె సతీష్ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా సి ఐ సతీష్ మాట్లాడుతూ. మహిళలు ఎందులోనూ తక్కువ కాదనీ నిరూపించారని కొనియాడారు. కరాటే పోటీలో పాల్వంచ విద్యార్థినిలు అవార్డులు సాధించడం పాల్వంచకె గర్వకారణం అన్నారు. కరాటే పోటీలో బహుమతులు సాధించిన వారిని అభినందించారు. కరాటే నేర్చుకోవడం వలన ఆత్మ రక్షణ మరియు శరీర దృఢత్వం మెరుగుపడుతుందని తద్వారా. విద్యార్థులలో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు అన్ని కళలను నేర్చుకావాలని అన్నారు. విదార్థులు ఇంకా మరెన్నో అహుమతులు, అవార్డులు సాధించి, తల్లి దండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. విద్యార్థినిలకు కరాటే కోచింగ్ ఇచ్చిన కోచ్ లు జె.మరియమ్మ, జె.రాము. అభినందించారు. అవార్డులు సాధించిన విద్యార్థినిలు బి.అక్షయ్.ఎం.మిధున్ రాజ్, బి విఘ్నేశ్వరి పి.శ్రావ్య,ఎం.మానవ్య,పి.నవీన ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ విద్యార్థులు బి.దీవెన,బి.ఉషా రాణి , జె.పావని ద్వితీయ స్థానంలో నిలిచారు,ఈ.జి.షిత మూడో స్థానంలో నిలిచింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వరోపా రాణి, పిడి నాన్సీ, పిఇటి సుజాత, ఉపాధ్యాయులు ,విద్యార్థులు తల్లిదండ్రులు, పాల్గొని అభినందించారు.

## టీజీఎస్‌పీడీసీఎల్ ఆధ్వర్యంలో ప్రజాబాట



**మేడిపల్లి, విశాలభారతి:**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ 10వ డివిజన్ పీర్జాదిగూడ మూసి పరివాహక ప్రాంతంలో నిరంతర విద్యుత్తు సరఫరా కోసం టీజీఎస్‌పీడీసీఎల్ చేపడుతున్న చర్యలను కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఆర్ వి ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవి అభినందించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ, ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి వెంటనే పరిష్కరిస్తున్న విద్యుత్ అధికారుల కృషి అభినందనీయమన్నారు. పాడైపోయిన కండక్టర్లను తొలగించి ఏవీ కేబుల్స్ అమర్చడం వల్ల భవిష్యత్తులో విద్యుత్ అంతరాయాలు లేకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని తెలిపారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని ముందస్తు ప్రణాళికలతో పనిచేస్తున్న టీజీఎస్‌పీడీసీఎల్ అధికారులకు ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ అమర్ సింగ్, పప్పుల అంజిరెడ్డి, కృష్ణ గౌడ్, జంగా చారి, వంగూరి పరమేష్, కవిడె కుమార్, మోహన్, నాగ రాజు, కొండల్ రెడ్డి, ఇర్ఫాన్, కరీం, మరియు టీజీఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్ నరసింహులు, సీఈ కామేష్, ఎస్ఈ వెంకన్న, డీఈ లింగయ్య, ఏడిఈ విజయ్ కుమార్ రెడ్డి, ఏఈ సత్యనారాయణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే విద్యుత్ సిబ్బంది, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## సహకార వ్యవస్థ బలోపేతమే పరిష్కారం

- **ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ జె.వి. సత్యనారాయణమూర్తి**




**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** రోజురోజుకు పెరుగుతున్న ఆర్థిక అంతరాలను తగ్గించాలంటే సహకార వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ చైర్మన్ జె.వి. సత్యనారాయణమూర్తి అన్నారు. రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌లో ఈనెల 8వ తేదీన బ్యాంకు 59వ నూతన శాఖను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం హయత్‌నగర్‌లోని బ్యాంకు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సమాజంలో కోటీశ్వరుల సంఖ్య పెరుగుతుండగా, మరోవైపు సామాన్యులు, పేద-మధ్యతరగతి ప్రజల ఆర్థిక స్థితిగతులు రోజురోజుకు దిగజారటం ఆందోళన కలిగించే విషయమన్నారు. ఈ ఆర్థిక అసమానతలను తగ్గించడంలో పేద, మధ్యతరగతి వర్గాల అవసరాలకు అనుగుణంగా పనిచేసే సహకార అర్బన్ బ్యాంకులు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. 110 సంవత్సరాల సుదీర్ఘ ప్రస్థానంలో అనేక ఒడిదుడుకులను అధిగమిస్తూ నేడు రూ.8,259 కోట్ల టర్నోవర్‌తో దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకుగా విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ ఎదిగిందని పేర్కొన్నారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో 58 శాఖలతో సేవలందిస్తున్న బ్యాంకు, హయత్‌నగర్‌లో ప్రారంభించనున్న 59వ శాఖను మాజీ శాసనసభ్యులు మానం ఆంజనేయులు ఈనెల 8న ప్రారంభించనున్నట్లు తెలిపారు. త్వరలో విశాఖపట్నంలో మరో నూతన శాఖను ఏర్పాటు చేసి మొత్తం బ్రాంచ్‌ల సంఖ్యను 60కి చేర్చడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని చైర్మన్ వెల్లడించారు. బ్యాంకు డైరెక్టర్లు చిన్నం కోటేశ్వరరావు, ఆచార్య ఎన్. అంజయ్య, జొన్నలగడ్డ ప్రసాద్, ఈమని అవని, బ్రాంచ్ మేనేజర్ పి.వి. దుర్గా, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

## సంక్రాంతి క్రికెట్ క్రీడోత్సవాలను విజయవంతం చేయండి



- **ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని చాటాలి : జైపాల శ్రీనాథ్**

**ఇబ్రహీంపట్నం , విశాలభారతి:** సంక్రాంతి క్రికెట్ క్రీడోత్సవాలను విజయవంతం చేయాలని జాపాల శ్రీకాంత్ పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని నందివనపర్తి గ్రామంలో జపాల భూదేవి నర్సింహ జ్ఞాపకార్థంగా సంక్రాంతి క్రికెట్ క్రీడోత్సవాలు జపాల శ్రీనాథ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు శ్రీనాథ్ తెలిపారు. నేటితో క్రికెట్ క్రీడలు ప్రారంభమై కనుమ పండుగతో ముగుస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనాథ్ మాట్లాడుతూ.. ఫైనల్ లో గెలిచిన జట్టుకు మొదటి బహుమతి రూ. 14,444 , ద్వితీయ బహుమతి రూ. 7,777 , తృతీయ బహుమతి రూ. 4,444 తో పాటుగా ఫీల్డ్ బహుకరుస్తామని తెలిపారు. క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయన్నారు. గెలుపోటములూ సహజమని , గెలుపోటములు సమానంగా స్వీకరించాలని అన్నారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని కోరారు. సంక్రాంతి క్రీడోత్సవాలలో విజయవంతం చేయాలన్నారు.

## పిఆర్టియు 2026 డైరీని ఆవిష్కరించిన అదనపు కలెక్టర్ శ్రీజ



**ఖమ్మం, విశాలభారతి:** పిఆర్టియు నూతన సంవత్సర డైరీని ఐడిఓసిలో అడిషనల్ కలెక్టర్ శ్రీజ ఆవిష్కరించారు . ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలో విద్యా ప్రమాణాలు పెంచాలని విద్యార్థులలో ఆలోచన శక్తులు పెంచాలని ప్రభుత్వ పాఠశాలకు వచ్చే బడుగు బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించి భావితరాలకు ఆదర్శంగా నిలవాలని కోరారు . ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కట్టా శేఖర్ రావు , నాయకులు హుస్సేన్ కుమార్ , శాంతా రెడ్డి , శ్రీనివాస చారి , రవికిరణ్ , సోమల రమణ , వినోద్ , లింగం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## నమ్మించి.. 4వేలకు కుచ్చుటోపి

- **అమాయకున్ని చేసి బురిడీ..**
- **బీరువా ఇస్తానని, టక్కరి దొంగ మోసం**
- **పాండురంగాపురంలో ఘటన**

**పాల్వంచ, విశాలభారతి:** అమాయకులే వీరి టార్గెట్ .మాయ మాటలు చెప్పడం.. అందినంత దండుకోవడం.. ఇది నయా ట్రెండ్ గా మారింది. ఇటీవల కాలంలో ఈ తరహా బ్రోకర్ గాళ్లు తమ నైపుణ్యంతో అమాయకులను బురిడీ కొట్టిస్తున్నారు. మాటల గారడీ ప్రదర్శించి, ప్రజల నుండి అందినంత దండుకోవడం అవకాశంగా మలుసుకుంటున్నారు. మాయగాల్ల ఉచ్చులో పడ్డ ఓ వ్యక్తి 4వేలు ముట్టచెప్పి, లబోదిబోమన్నాడు. మండల పరిధి పాండురంగాపురంలో మంగళవారం చోటు చేసుకున్న విచిత్ర ఘటన వివరాల్లోకెళ్తే.. బాధితుని కథనం ప్రకారం.. పాండురంగాపురం కు చెందిన షేక్ జానీ ఇంటికి ఇద్దరు వ్యక్తులు గృహపకరణాలు ఇస్తామంటూ నమ్మబలికారు. రూ పదివేల బీరువా 8 వేలవుతుందని జానీ ని నమ్మించారు. సగం డబ్బు చెల్లించాలని పేర్కొనడంతో.. బాధితుడు రూ 4 వేలు చెల్లించాడు. సెల్‌ఫోన్ నెంబర్ ఇచ్చిన మోసగాళ్లు తరువాత స్విచ్ ఆఫ్ చేశారు. మోసపోయానని గ్రహించిన బాధితుడు తనకు జరిగిన అన్యాయాన్ని విలేకరులకు ఏకరువు పెట్టాడు. ద్విచక్ర వాహనాలపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు తనను మోసం చేశారని బాధితుడు పేర్కొన్నారు. ఇదో తరహా దొంగల ముఠాపనిగా స్థానికులు తెలిపారు.

## ఉరేసుకొని యువతి మృతి

- **హైదరాబాద్ ఎల్బీనగర్ సమీపంలోని హాస్టల్ లో ఘటన**
- **కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన మీర్ పేట్ పోలీసులు**



**అశ్వాపురం, విశాలభారతి:** అనుమానాస్పద స్థితిలో హైదరాబాదులోని ఎల్బీనగర్ మీర్ పేట్ లో గల ఓ ప్రైవేటు వసతి గృహంలో యువతి మృతి చెందిన సంఘటన ఈ నెల 4వ తేదీ ఆదివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం అశ్వాపురం మండల కేంద్రానికి చెందిన కనుకు సరస్వతి (21) అనే యువతి ఏడాది నుండి కంప్యూటర్లో కోచింగ్ తీసుకునేందుకు హైదరాబాద్ వెళ్లినట్లు కుటుంబీకులు తెలిపారు. అదేవిధంగా ఓ రెండు నెలల నుండి ఓ ప్రైవేట్ కాల్ సెంటర్లో పనిచేస్తున్నట్లు కూడా తెలిపారు. ఈ క్రమంలో మృతురాలుకి అశ్వాపురం మండల కేంద్రంలో కిరాణా షాప్ నిర్వహించుకుంటున్న పాలడుగు పుల్లయ్య కుమారుడైన పాలడుగు నందకిషోర్ అనే యువకుడితో ప్రేమలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఆదివారం కూడా వారిద్దరి మధ్యన చరవాణిలో కొన్ని సంభాషణలు జరిగినట్లు విశ్వాసనీయ వర్గాల సమాచారం. ఆ సంభాషణలో సదరు యువకుడు మాట్లాడిన మాటలకు మనస్థాపానికి గురైన యువతి ఉరేసుకుని మృతి చెందిందని ఆరోపిస్తూ మంగళవారం మృతురాలి తల్లిదండ్రులతో పాటు బంధువులు అశ్వాపురం మండల కేంద్రంలోని ఆర్ అండ్ బి ప్రధాన రహదారిపై ఆందోళనకు దిగారు. సుమారు అరగంట పాటు ఆందోళన కొనసాగించారు. ఆందోళన చేస్తున్న వద్దకు అశ్వాపురం ఎస్సై రాజేష్ సిబ్బందితో వచ్చి ఆందోళకారులకు నచ్చజెప్పి విరమింప చేశారు. రోడ్డుపై ఆందోళన విరమించిన అనంతరం మృతురాలి బంధువులతో పాటు కుటుంబీకులు బాధితులుగా ఆరోపిస్తున్న యువకుడి ఇంటిముందు టెంటు వేసి మృతదేహంతో సహా ఆందోళన చేపట్టారు. మృతురాలి కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఆందోళన కొనసాగిస్తామని మృతురాలి బంధువులు పట్టుబట్టి కూర్చున్నారు. మీర్ పేట్ పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. యువతి మృతదేహంతో సుమారు నాలుగు గంటల పాటు కుటుంబ సభ్యులు బంధువులు యువకుడి ఇంటి ముందు ఆందోళన నిర్వహించారు. అయితే వారు ఆందోళన నిర్వహిస్తున్న సమయంలో యువకుడి తల్లిదండ్రులతో పాటు ఇంట్లో ఎవరు లేనప్పటికీ స్థానికంగా ఉన్న కొందరు పెద్ద మనుషులు, కొన్ని కుల సంఘాల నాయకులు సుదీర్ఘ మంతనాలు చేపట్టారు. అనంతరం పంచాయతీని ఓ కొలిక్కి తీసుకొని వచ్చి వారికి నచ్చే విధంగా హామీ ఇచ్చేలా ఏర్పాటు చేసి ఒప్పందాలు కుదుర్చుకోవడంతో ఆందోళనను విరమించారు.



# ‘టాక్సిక్’లో మరో హీరోయిన్.. ఫస్ట్‌లుక్ రిలీజ్

యశ్ హీరోగా మలయాళ దర్శకురాలు గీతూమోహన్‌దాస్ ‘టాక్సిక్’ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ‘ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్’ అనేది ట్యాగ్ లైన్. ప్రస్తుతం దీని షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా ఈ సినిమాలో రుక్మిణి వసంత్ ఉన్నట్లు టీమ్ ప్రకటించింది. ఇందులో ఆమె మెలిసా అనే పాత్రలో కనిపించనున్నారు. ఈ విషయాన్ని తెలుపుతూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. మోడ్రన్ డ్రెస్‌లో పబ్‌లో నడుస్తూ రుక్మిణి కనిపిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాలో ముగ్గురు హీరోయిన్‌ల లుక్‌ను విడుదల చేశారు. ఇప్పుడు రుక్మిణి కూడా అందులో ఉన్నట్లు అధికారికమైంది. దీంతో ఇందులో ఐదుగురు హీరోయిన్స్ అయ్యారు. నదియా పాత్రలో కియారా కనిపించనుండగా హ్యూమా ఖురేషీ ఎలిజబెత్‌గా, నయనతార గంగ పాత్రలో, రెబెకాగా తారా సుతారియా అలరించనున్నారు. చిన్నారుల కోసం ఎన్నో కథలు తెరకెక్కాయని, ఇది పెద్దలకు సందేశమిచ్చే చిత్రమని యశ్ ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. భారీ అంచనాల మధ్య వచ్చే ఏడాది మార్చి 19న ప్రేక్షకుల ముందుకురానుంది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.